

మంత్రి హరీశ్‌రావు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు (ఫైల్)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



మెదక్
20
బుధవారం 9 ఆగస్టు 2017

కాంగ్రెస్ కోటకు బీటలు

- విఫలమయిన మాజీ మంత్రి సునీతారెడ్డి ప్రయత్నాలు
- టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న 'వెల్దుర్తి' రాజకీయ కురువృద్ధులు

5

రేపటి సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

- జిల్లాలో కాళ్లకల్ నుంచి దామరచెర్వు వరకు..
- యావాపూర్ నుంచి కూడా..
- 50 కి.మీ. మేర ఏర్పాట్లు

5

పంటకు ప్రాణం

చినుకు కోసం రెప్పవాల్చకుండా.. ఎప్పుడెప్పుడు వాన పడుతుందా.. అని ఎదురుచూస్తున్న రైతన్నకు కాస్త ఊరట దొరికింది. జిల్లాలో పలు చోట్ల సోమ, మంగళవారాల్లో మోస్తరు వర్షం పడింది. నెర్రెలిచ్చిన భూములకు ప్రాణం పోసింది. వరి, మొక్క జొన్న, పెసర, కంది తదితర వందలాది ఎకరాల్లో ఎండుముఖం పట్టిన పంటలకు ఊపిరిలూదినట్లయింది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తేనే పంటలు దిగుబడుల వరకు రావడంతో పాటు చెరువులు, కుంటలకు జలకళ వస్తుంది. లేదంటే కరువు తప్పదు. వరుణుడు కరుణించాలని పల్లెల్లో రైతులు పూజలు చేస్తున్నారు. శివుడికి అభిషేకాలు చేస్తున్నారు. మొగులు మెత్తబడి కరువుతీరా వానలు పడాలని రైతాంగం వేడుకుంటున్నది.

- జిల్లాలో పలు చోట్ల వర్షం
- ఏడు మండలాల్లో 10 మి.మీ.కు పైగా వర్షపాతం
- మిగిలిన చోట్ల ఊరించి చిన్నపాటి జల్లులకే పరిమితం
- రామాయంపేట మినహా అన్ని మండలాల్లోనూ లోటు వర్షపాతమే
- ముున్ముందు వరుణుడు కరుణిస్తేనే పంటలు దక్కేది

4



వివాదాస్పదంగా మారిన నాగ్సాన్‌పల్లి ప్రభుత్వ భూములు

- 57 మందికి షోకాజ్ నోటీసులు
- ఆందోళనలో గ్రామస్థులు




5

నాగ్సాన్‌పల్లి శివారులో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మించిన పౌల్ట్రీఫాం

కోర్టు చెక్కు ఇచ్చింది.. బ్యాంకు డబ్బుల్లేవంది!

- నష్టపరిహారంపై బీమా కంపెనీతో మూడేళ్లు పోరాడి గెలిచిన నారాయణ
- కోర్టు ఇచ్చిన చెక్కును నిలిపివేసిన బ్యాంకు అధికారులు

5



బాధితుడికి కోర్టు ఇచ్చిన చెక్కు

ఇంటర్వ్యూ



ఇంత నిరంకుశత్వం ఎప్పుడూ చూడలేదు

• ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు సునీతారెడ్డి

నర్సాపూర్: ఇంతటి నిరంకుశ పాలన గతంలో ఎప్పుడూ చూడలేదని, మంత్రిని కలిసి ప్రజల సమస్యలు విన్నపించుకోకుండా నిర్బంధించి అరెస్టులకు పాల్పడటం అప్రజాస్వామికమని మాజీ మంత్రి, డీసీసీ అధ్యక్షురాలు సునీతారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

మిమ్మల్ని ముందస్తు అరెస్టు చేయడానికి కారణం ఏమిటి ?

మంత్రి హరీశ్‌రావు నర్సాపూర్‌కు రాఖీ పౌర్ణమి నాడు వస్తున్నందున పట్టాలు పొందిన లబ్ధిదారులతో కలిసి వెళ్లి ఆయనకు రాఖీ కట్టి వారికి న్యాయం చేయాలని కోరడానికి వెళ్తామంటే అప్రజాస్వామికంగా అరెస్టు చేయడం దారుణం.

ఆ పట్టాలన్నీ అనర్హులు, కాంగ్రెస్ కార్యకర్తలకే ఇచ్చారని టీఆర్ఎస్ నాయకులు అంటున్నారు?

అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఆర్డీవోతో పాటు ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది అంతా కలిసి వారిని ఎంపిక చేశారు. ఇప్పుడు టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇప్పటి అధికారులు ఎలా అనర్హులుగా ప్రకటిస్తున్నారో అర్థం కావడం లేదు. లబ్ధిదారుల ఎంపికలో మేము జోక్యం చేసుకోలేదు.

కాంగ్రెస్ హయాంలో ఇళ్ల పట్టాలు ఎన్నిచ్చారు?

నర్సాపూర్‌లో 2013 సంవత్సరంలో 1370 పట్టాలిచ్చాం.

ప్రస్తుతం అదే స్థలంలో ఇళ్లు నిర్మించి ఇస్తామంటున్నారా?

డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి మేము వ్యతిరేకం కాదు. కానీ కాంగ్రెస్ పట్టాలిచ్చిన వారికి అదే స్థలం కేటాయించి, కొత్త లబ్ధిదారులకు మరోచోట నిర్మించాలనేదే మా ప్రధాన డిమాండ్.

లోకాయుక్తనే అనర్హులకు పట్టాలిచ్చారని పేర్కొందని టీఆర్ఎస్ వాదన?

టీఆర్ఎస్ నాయకులు తప్పుడు సమాచారంతో లోకాయుక్తను ఆశ్రయించారు. ఇప్పటి అధికారులు కూడా అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి లొంగి తప్పుడు నివేదికలు ఇచ్చారు.

అప్పుడు పట్టాలిచ్చిన వారిలో అర్హులకు ఇస్తామంటున్నారు ?

టీఆర్ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే 1370 ఇళ్ల పట్టాల్లో అనర్హులు ఎవరో.. అందులో కాంగ్రెస్ వారు ఎవరో దమ్ముంటే బయటపెట్టాలి. కేవలం వారి రాజకీయ ప్రయోజనాల కోసం టీఆర్ఎస్ నాయకులు ఈ విధంగా చేస్తున్నారు.

మీరే అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అధికార పార్టీ నాయకుల ఆరోపణ?

టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి మూడేళ్లయింది. ఇప్పటి వరకు వారు నియోజకవర్గానికి ప్రత్యేకంగా చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పమనండి. కాంగ్రెస్ హయాంలో మంజూరైన నిధులతో నిర్మించిన వందపడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల తదితర వాటిని తాము చేశామంటు చెప్పుకుంటున్నారు. నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి కూడా నిధులు నా హయాంలో మంజూరైనా ప్రజాప్రతినిధులు భవనం నిర్మించలేకపోతున్నారు.

నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పరిస్థితి ఏవిధంగా ఉంది ?

చాలా బలంగా ఉంది. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు ఎందరో ఉన్నారు.

జిల్లాలో కాంగ్రెస్ పరిస్థితి?

టీఆర్ఎస్ మాయమాటలతో అధికారంలోకి వచ్చిందే తప్ప ఎన్నికల హామీ ఒక్కటి కూడా అమలు కావడంలేదు. ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం. టీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. కాంగ్రెస్ అన్ని నియోజకవర్గాల్లో ప్రజా సమస్యలపై పోరాడుతోంది.

బొప్పాయితో బోలెడు లాభాలు

• 15 ఏళ్లుగా సాగు చేస్తున్న గుండప్ప • తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి • ప్రోత్సాహం కోసం ఎదురు చూపు

వ్యవసాయం చేయడమంటేనే ఏటికి ఎదురీదడం అన్నట్లుగా పరిస్థితులు మారుతున్న ఈ రోజుల్లో 15 ఏళ్ల నుంచి బొప్పాయి తోటను సాగు చేస్తూ రైతులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు కంగ్టి మండలంలోని భీంరా గ్రామానికి చెందిన మాలేకర్ గుండప్ప - కంగ్టి



కంగ్టి మండలంలోని భీంరా గ్రామానికి చెందిన మాలేకర్ గుండప్ప బొప్పాయిపై మక్కువతో 15 సంవత్సరాలుగా సాగు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మండలంలో సాగవుతున్న బొప్పాయి తోట ఇదొక్కటే కావడంతో లాభాలు సైతం బాగానే వస్తున్నాయంటున్నాడు. సదరు రైతు మార్కెట్లో లభిస్తున్న ప్రతి పండు రసాయనాల వాడకంతో కలుషితమౌతున్న ఈ రోజుల్లో ప్రకృతి సిద్ధంగా కాసిన ఫలాలనే ప్రతిరోజూ కోస్తూ సమీప మార్కెట్లలో అమ్ముతుండడంతో ఆయన అమ్మే బొప్పాయి పండ్లు హాట్‌కేకుల్లా అమ్ముడవుతుంటాయి. గుండప్ప తనకున్న ఐదెకరాల్లో ఒక ఎకరా బొప్పాయి సాగు చేయగా మరో ఎకరాలో వంకాయ, మిరప ఇతర కూరగాయలు సాగు చేస్తున్నాడు. బొప్పాయితో మంచి దిగుబడులు సాధించేందుకు గుండప్ప మహారాష్ట్రలోని పుణె నుంచి నాణ్యమైన విత్తనాలను పోస్టు ద్వారా తెప్పించుకుంటాడు. గుండప్పపై పుణేలోని విత్తన వ్యాపారులకు పూర్తిగా నమ్మకం పెరగడంతో ఆయన కోరిన వెంటనే వారు విత్తనాలను పోస్టు ద్వారా పంపిస్తుంటారు. రూ.4 వేలకు తులం చొప్పున బొప్పాయి విత్తనాలు లభిస్తుండడంతో 2 నుంచి 3 తులాలు విత్తనాలు తెప్పించుకుని ఎకరాలో నాటుతుంటాడు. ఒక తులానికి 3 వందల విత్తనాలు లభిస్తుండడంతో ఎకరాకు 7 వందల విత్తనాలు నాటుతున్నాడు. 5 నెలల అనంతరం అంతర పంటలుగా స్వల్పకాలంలో చేతికొచ్చే టమాట, వంకాయ వంటి కూరగాయలు సాగు చేసి బొప్పాయికి అవసరమయ్యే పెట్టుబడిని వీటి ద్వారానే పొందుతూ అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. నాటిన ఏడాదికి కాతకు వచ్చే బొప్పాయి ప్రతి మూడు నెలలకోమారు రసాయన ఎరువులు వేస్తున్నాడు. ఇలా ఒక సారి నాటిన బొప్పాయి చెట్టు 3 సంవత్సరాల వరకు ఫలాలనిస్తుందని రైతు గుండప్ప తెలిపాడు. తక్కువ పెట్టుబడితో బొప్పాయిలో అధిక లాభాలు పొందవచ్చునని ఆయన పేర్కొన్నాడు. ఒక్కో చెట్టుకు 2 వందల నుంచి 3 వందల వరకు కాయలు కాస్తుంటాయని పరిస్థితులను బట్టి కిలో బొప్పాయిని రూ.20 నుంచి రూ. 30 వరకు విక్రయిస్తానని ఆయన అన్నారు. విత్తనాలు నాటడంతో మొదలుకొని నీరు పెట్టడం, కలుపు తీయడం, చివరకు కోసిన బొప్పాయి పండ్లను స్వంత ఆటోలో మార్కెట్లకు తరలించి విక్రయించడం గుండప్ప కుటుంబీకులే చేస్తుండడం విశేషం. ఇలా పండిన పండ్లను ఏ రోజు మార్కెట్‌కు వెళ్లాల్సి ఉంటే అదే రోజు తాజా పండ్లను తెంపి తరలిస్తుంటాడు. కంగ్టితో పాటు తడ్కల్, పిట్లం, నారాయణఖేడ్, ఔరాద్, జమ్గి మార్కెట్లలో అమ్ముతుంటాడు. బొప్పాయిపై నమ్మకంతో 15 ఏళ్లుగా లాభాలు గడిస్తున్నాడు గుండప్ప.

ప్రభుత్వ సహాయం అందడం లేదు



పండ్లతోటలు సాగు చేస్తే సర్కారు సబ్సిడీ ఇస్తదని విన్నాకాని నాకు ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందలేదు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి పరికరాలు కూడా నాకు అందలేదు. చదువుకోని నాకు డబ్బులు కడితే అధికారులు డ్రిప్ ఇస్తారో లేక సతాయిస్తారోనని భయపడి ధరఖాస్తు పెట్టలేదు. దీంతో కష్టమైనా నేనే పారతో నీరు పారబెడుతున్నాను. సర్కారు సాయం చేస్తే బొప్పాయి తోట మరింత ఎక్కువగా సాగు చేసుకుంటా.

- గుండప్ప



బొప్పాయి చెట్లకు ఏపుగా కాసిన కాయలు, తోట పక్కనే గుండప్ప సాగు చేస్తున్న మిరప, సోయా పంటలు

ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

• తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి భీంరావు

ఉద్యోగపర్వం



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలి. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్లతో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. వాటికి అనుగుణంగా ప్రభుత్వాసుపత్రుల్లో నర్సింగ్, సహాయ సిబ్బందిని అదనంగా నియమించాలి. ప్రభుత్వాసుత్రుల్లోని ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి, ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలి. ఆసుపత్రులకు వస్తున్న రోగుల సంఖ్యను బట్టి పడకల సంఖ్యను పెంచాలి. ఆస్పత్రుల అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేయాలి.

- సదాశివపేట రూరల్

తులసి చెట్టుకు పూజ చేస్తే అన్నీ శుభాలే

• పురోహితులు కృష్ణశర్మ

భక్తి



ఉదయం నిద్ర నుంచి లేచిన వెంటనే ముందుగా తులసి చెట్టును చూస్తే ముల్లోకాల్లోని సకల తీర్థాలను దర్శించిన పుణ్యం కలుగుతుంది. తులసి చెట్టు మనుషులను, ఇంటి వాతావరణాన్ని పవిత్రంగా చేస్తుంది. ఈ చెట్టు ఎంతో పుణ్యఫలం ప్రసాదిస్తుంది. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కలుగజేస్తుంది. తులసి కోటను లేదా చెట్టును ప్రతినిత్యం భక్తి శ్రద్ధలతో పూజించి నీళ్లుపోయాలి. ప్రదక్షిణ చేసి నమస్కరించాలి. తద్వారా అశుభాలన్నీ తొలగి సకలశుభాలు చేకూరుతాయి. మనోభీష్టాలన్నీ నెరవేరతాయి. తులసి వనాన్ని కలిగిన ఇల్లు పుణ్యతీర్థంతో సమానమైనదని అనేక పురాణాలు, శాస్త్రాల్లో పేర్కొనబడింది. తులసి పూజ ముఖ్యంగా స్త్రీలకు సుఖసౌభాగ్యాలను కలిగిస్తుంది. ఉదయం, సాయంకాలం తులసి కోట వద్ద దీపారాధన చేయడం వల్ల మిక్కిలి మంగళప్రదంగా ఉంటుంది. ఇంటి ఆవరణలో తులసి చెట్టు ఉంటే చాలు క్షుద్రశక్తుల ప్రయోగాలు కూడా నీరుగారిపోతాయి.

- సంగారెడ్డి

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

మెదక్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో 18-35 సంవత్సరాల నిరుద్యోగ యువతీ యువకులకు పలు పరిశ్రమల యాజమాన్యాలు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి కల్పించనున్నట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రముఖ కంపెనీలైన హెటిరో ల్యాబ్స్, ఐసీఐసీఐ అకాడమీ ఆఫ్ స్కిల్స్, దుర్గా సాఫ్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణానికి చెందిన యువతీ యువకులకు మాత్రమే హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్ల ప్రతులు, ఆధార్‌కార్డు జిరాక్సు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో ఈ నెల 10వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు సంప్రదించాలని సూచించారు. డ్రగ్-ఫార్మా(టెక్నికల్-ప్రొడక్షన్) సెక్టార్‌లో మ్యాన్‌ఫ్యాక్చరింగ్ అసిస్టెంట్, క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అషూరెన్స్ కెమిస్ట్, క్వాలిటీ కంట్రోల్ కెమిస్ట్, మైక్రో బయాలజీ విద్యార్హతలు ఎస్ఎస్‌సీ, ఇంటర్, బీఎస్సీ/బీఫార్మసీ, ఎంఎస్సీ కలిగి ఉండాలి. ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషన్ కోర్సుకు బీటెక్ లెక్ట్రికల్, మెకానికల్ అండ్ క్వాలిటీ టెక్నీషియన్ కోర్సుకు బీటెక్ మెకానికల్, మేనేజ్‌మెంట్ ట్రైనీస్ కోర్సుకు బీకాం, ఎంకాం, ఎంబీఏ, మార్కెటిం గ్ అండ్ ఫైనాన్స్ హెచ్‌ఆర్ విద్యార్హత కలిగి ఉండాల్సిందిగా పేర్కొన్నారు. ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌కు ఇంటర్, డిగ్రీ, సెల్లింగ్‌స్కిల్స్‌కు ఎస్ఎస్‌సి నుంచి డిగ్రీ వరకు చదివి ఉండాలి. ఇక దుర్గాసాఫ్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో కోర్ అండ్‌అడ్వాన్స్డ్ జావా కోర్సుకు విద్యార్హత బీటెక్, బీకాం కంప్యూటర్స్, బీసీఏ, బీఎస్సీ కంప్యూటర్స్, ఎంఎస్సీ కంప్యూటర్స్, ఎంసీఏ పూర్తిచేసి ఉండాలి. టెస్టింగ్ టూల్స్ కోర్సుకు బీటెక్, బీకాం కంప్యూటర్స్, బీసీఏ, బీఎస్సీ కంప్యూటర్స్, ఎంఎస్సీ కంప్యూటర్స్, ఎంసీఏ విద్యార్హతలు కలిగి ఉండాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రావు సూచించారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

పాపన్నపేట: హత్యాయత్నానికి యత్నించిన ఓ వ్యక్తికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 10వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2016 ఏప్రిల్‌లో ఎల్లాపూర్ వద్ద కృష్ణ అనే వ్యక్తిని కృపాకర్ అనే మరో వ్యక్తి కారుతో ఢీ కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డ విషయమై అప్పట్లో కేసు నమోదైందని ఎస్ఐ తెలిపారు. నేరం రుజువు కావడంతో మెదక్ సబ్‌జడ్జి వాణి మంగళవారం ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 10వేల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

చేగుంట: నెల రోజుల క్రితం అస్వస్థతకు గురై మృతి చెందిన యువకుడి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. మండలంలోని పొలంపల్లికి చెందిన అనిల్‌కుమార్(23) చిన్నశంకరంపేట మండలం చందంపేటలోని ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. 41 రోజుల క్రితం అస్వస్థతకు గురై మృతి చెందాడు. కుటుంబ ఆచారాల ప్రకారం అనిల్‌కుమార్ మృతదేహాన్ని పొలంపల్లి గ్రామ శివారులో తండ్రి నర్సింలు పూడ్చిపెట్టాడు. ఎంఎస్ఎన్ కంపెనీ ఇచ్చిన మందులే తన కుమారుడి మరణానికి కారణమంటూ మృతుడు అనిల్‌కుమార్ తండ్రి నర్సింలు చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగాంగా గాంధీ ఆస్పత్రి వైద్యుడు లక్ష్మణ్ బృందం ఆధ్వర్యంలో పూడ్చిపెట్టిన అనిల్‌కుమార్ మృతదేహాన్ని వెలికి తీశారు. చేగుంట తహశీల్దార్ విజయలక్ష్మి సమక్షంలో శరీరంలోని కొన్ని భాగాలను సేకరించారు. ఎంఎస్ఎన్ పరిశ్రమ ఇచ్చిన మందులను మృతుడి తండ్రి వైద్యాధికారులకు అందజేశారు. వాటిని కూడా భద్రపరిచారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం కేసు విచారణ కొనసాగుతుందని ఎస్ఐ తెలిపారు.



శవాన్ని వెలికితీస్తున్న దృశ్యం

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

పాపన్నపేట: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ సందీప్‌రెడ్డి కథనం మేరకు.. నాగ్సాన్‌పల్లికి చెందిన ఎర్రచాకలి ప్రవీణ్(22) అప్పుల బాధ తాళలేక సోమవారం 3గంటల ప్రాంతంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేస్తున్నాడు. ఈ విషయాన్ని మృతుని తమ్ముడు గమనించి చుట్టు పక్కల వారికి తెలిపాడు. మృతుడి తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలిపారు. వారు వచ్చేంత వరకు శవాన్ని భద్రపరచడానికి మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మంగళవారం మృతుని తండ్రి దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవ పంచనామా అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతుని మరణంపై ఊహాగానాలు తలెత్తడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

శతాధిక వృద్ధురాలి మృతి

మనోహరాబాద్ (తూప్రాన్): మెదక్ జిల్లా కాళ్లకల్‌కు చెందిన శతాధిక వృద్ధురాలు మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌కు చెందిన నేతికుంట మల్లమ్మ(104) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఇప్పటి వరకు మల్లమ్మ తన పనులు తానే చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 3రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆమె మంగళవారం మృతిచెందింది. మల్లమ్మకు కూతురు సత్తెమ్మ ఉంది. భర్త వీరయ్య 64 ఏళ్ల క్రితమే మృతి చెందినట్లు గ్రామస్తులు చెప్పారు. నేతికుంట మల్లమ్మ మృతి పట్ల పలువురు గ్రామస్తులు సంతాపం తెలిపారు.



మల్లమ్మ (ఫైల్)

కలెక్టరేట్‌లో రక్షాబంధన్



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న బాలిక



- ఆడపిల్లను రక్షిద్దాం- చదివిద్దాం అనే నినాదంతో రూపొందించిన రాఖీలు
- కలెక్టర్‌కు రాఖీలు కట్టిన బాలసదనం బాలికలు

మెదక్: ఆడపిల్ల అంటేనే చీదరించుకొనే సంస్కృతిని నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని కలెక్టర్ భారతిహోళికేరి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో బాలల సంరక్షణ విభాగం, మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలిక రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదివిద్దాం అనే నినాదంతో రూపొందించిన రాఖీలను బాలసదనం విద్యార్థులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సురేష్‌బాబుకు కట్టారు. ఈ నెల 10వ తేదీ అంగన్‌వాడీ విద్యార్థులతో ఆయా ప్రాంతాల్లోని సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు రాఖీలు కట్టించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి జ్యోతిపద్మ, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శివకుమారి, జిల్లా వైద్యాధికారి డా. వెంకటేశ్వర్‌రావు, బాలల సంరక్షణాధికారి రామకృష్ణ, సిబ్బంది గోపాల్, విఠల్ పాల్గొన్నారు.

రేపటి సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

- జిల్లాలో కాళ్లకల్ నుంచి దామరచెర్వు వరకు..
- యావాపూర్ నుంచి కూడా 50 కి.మీ. మేర ఏర్పాట్లు

తూప్రాన్: ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఈనెల 10న నిజామాబాద్ జిల్లా పర్యటన నేపథ్యంలో మెదక్ జిల్లాలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడు శివారులో ఎస్సారెస్పీ వద్ద 'ఎస్సారెస్పీ పునరుజ్జీవ' పథకం చేపడుతున్నారు. ఈ పథకానికి సీఎం 10న శంకుస్థాపన చేసి, భారీ బహిరంగసభలో ప్రసంగించనున్నారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి జిల్లా మీదుగా వెళ్తుండటంతో భారీ రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. సీఎం హైదరాబాద్ నుంచి వస్తే మనోహరాబాద్ మండలం కాళ్లకల్ నుంచి రామాయంపేట మండలం దామరచెర్వు వరకు 50 కిలోమీటర్ల మేర బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఒకవేళ సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫాంహౌజ్ నుంచి వస్తే తూప్రాన్ మండలం యావాపూర్ నుంచి దామెరచెర్వు వరకు 40 కిలోమీటర్ల మేర బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. రక్షణ చర్యలు చేపట్టడానికి తూప్రాన్, రామాయంపేటలో పోలీసు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. తూప్రాన్ డీఎస్పీ ఎగ్గడి భాస్కర్ ఆధ్వర్యంలో చేపట్టనున్న రక్షణ చర్యల్లో తూప్రాన్‌లో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, మరో 60 మంది సిబ్బందిని కేటాయించినట్లు సమాచారం. రామాయంపేటలోనూ ఇదే విధంగా ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సిబ్బందిని కేటాయించారు. తూప్రాన్‌కు నర్సాపూర్ నుంచి, రామాయంపేటకు మెదక్ పరిధి నుంచి పోలీసు బలగాలను రప్పిస్తున్నారు. గురువారం సీఎం పర్యటన నేపథ్యంలో తూప్రాన్, రామాయంపేటలో బుధవారం ఉదయం 7 గంటల్లోగా రిపోర్టు చేయాలని ఆయా పోలీసుస్టేషన్ల అధికారులు, సిబ్బందికి సూచించారు. హైవే 44 పొడవున అడుగడుగున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

పీహెచ్‌సీలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన రవిచింతల


తూప్రాన్ పీహెచ్‌సీలో ప్రసవాల గదిని పరిశీలిస్తున్న జిల్లా క్వాలిటీ అస్యూరెన్స్ అధికారి రవిచింతల

తూప్రాన్: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం క్వాలిటీ అస్యూరెన్స్ అధికారులను ఏర్పాటు చేసింది. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని పీహెచ్‌సీని మంగళవారం జిల్లా క్వాలిటీ అస్యూరెన్స్ అధికారి రవిచింతల పరిశీలించారు. తూప్రాన్‌లోని పీహెచ్‌సీలో రోగుల కేర్, హాస్పిటల్ నిర్వహణ, కేసీఆర్ కిట్స్ పంపిణి, ఈ-ఔషధీ, ఇన్‌ఫెక్షన్ ఆదుపు, రోగుల సంఖ్య, ప్రసవాలతీరు, పరిశుభ్రత నిర్వహణ, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు తదితర ఆంశాలను రవి పరిశీలించారు. తూప్రాన్ పీహెచ్‌సీలో పరిశీలన ఆంశాల నివేదికను జిల్లా వైద్యాధికారి, జిల్లా కలెక్టర్, కమిషనరేట్‌లకు అందజేయనున్నట్లు రవిచింతల పేర్కొన్నారు. తనిఖీలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి సాధన, సిబ్బంది కుమార్, శశిరేఖ పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి భవనాన్ని పరిశీలించిన సీఈ


వంద పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలిస్తున్న సీఈ లక్ష్మారెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్‌లో నూతనంగా నిర్మించిన వంద పడకల ఆస్పత్రి భవనాన్ని మంగళవారం వైద్య విధాన పరిషత్ ఇంజనీరింగ్ విభాగం సీఈ లక్ష్మారెడ్డి పరిశీలించారు. రూ.11 కోట్లతో నూతనంగా వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణంతో పాటు అధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆస్పత్రి నిర్మాణం పూర్తయి త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. అందులో భాగంగా సీఈ లక్ష్మారెడ్డి, ఎస్‌ఈ సురేం దర్ రెడ్డి, డీఈ దామోదర్ తదితరులు నిర్మాణం పనులతో పాటు ఇతర సౌక ర్యాలు, సదుపాయాలను పరిశీలించి కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు.

పంటకు ప్రాణం

- జిల్లాలో పలు చోట్ల వర్షం
- ఏడు మండలాల్లో పది మి.మీ.కు పైగా వర్షపాతం
- మిగిలిన చోట్ల ఊరించి చిన్నపాటి జల్లులకే పరిమితం
- రామాయంపేట మినహా అన్ని మండలాల్లోనూ లోటు వర్షపాతమే
- మున్ముందు వరుణుడు కరుణిస్తేనే పంటలు దక్కేది



ఆంధ్రజ్యోతి, మెదక్: నిండు వర్షాకాలంలో మండు వేసవిని తలపించే ఎండలతో నెర్రలు వారిన పంట పొలాలకు ప్రాణం పోస్తూ జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసింది. వరుణుడు కాసింత కరుణ చూపడం రైతులకు ఊరట నిచ్చింది.

ఏడు మండలాల్లో వర్షం

సోమవారం, మంగళవారం ఉదయం జిల్లాలోని పలు మండలాల్లో మోస్తారు వర్షం పడింది. జిల్లాలో సగటు వర్షపాతం 8 మి.మీ. కాగా టేక్మాల్ మండలంలో అత్యధికంగా 29.4 మి.మీ, నార్సింగిలో 23.5 మి.మీ, కౌడిపల్లిలో 20, మెదక్‌లో 15.15, అల్లాదుర్గంలో 11.6, వెల్దుర్తిలో 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం ఆకాశం మేఘావృతమైనా చిన్నపాటి జల్లులతోనే సరిపెట్టింది. మంగళవారం తెల్లవారుజామున పలుచోట్ల వర్షం కురిసింది. నర్సాపూర్, శివ్వంపేట మినహా అన్ని మండలాల్లో ఎంతో కొంత మేర వర్షపాతం నమోదైంది. ఒక్క రామాయంపేట మండలం మినహా జిల్లాలో అన్ని చోట్ల లోటు వర్షపాతం ఉంది. జిల్లా సగటు 32 శాతం సాధారణం కన్నా తక్కువ వర్షాలు పడగా, కొల్చారం మండలంలో 63శాతం, చిలప్‌చెడ్‌లో 62, కౌడిపల్లి 58, హవేళీ ఘణపూర్ 42, పెద్దశంకరంపేట, పాపన్నపేట మండలాల్లో 40 శాతం మేర సాధారణం కన్నా తక్కువ వానలు పడ్డాయి. ఆగస్టులో ఇప్పటి వరకు జిల్లాలో 63.6 మి.మీ. వర్షం పడాల్సి ఉండగా కేవలం 10.1 మి.మీ. మాత్రమే నమోదైంది. ఈ సీజన్‌లో జులైలో అతి తక్కువగా వానలు పడ్డాయి.

జిల్లాలో జూన్ నుంచి వర్షపాతం (మిల్లీమీటర్లలో)

మం..	కు.వా	కు.సి	శా..
పెద్దశంకరంపేట	442.4	266.3	40
రేగోడ్	409	367.3	10
అల్లాదుర్గం	434.5	268.2	38
టేక్మాల్	400.5	279.73	30
పాపన్నపేట	426	253.49	40
హవేళీఘణపూర్	500	289.69	42
రామాయంపేట	366.1	381.89	4
నిజాంపేట	366.1	341.4	7
చేగుంట	458.4	369.9	19
నార్సింగి	467	400.7	14
శంకరంపేట(ఆర్)	473.2	287.7	39
మెదక్	500	404.49	19
కొల్చారం	446.8	163.75	63
చిలప్‌చెడ్	558.1	212.2	62
కౌడిపల్లి	558.1	235.76	58
నర్సాపూర్	479.2	323.31	33
శివ్వంపేట	445.9	278.14	38
వెల్దుర్తి	455.5	327.86	28
తూప్రాన్	362.5	293.45	19
మనోహరాబాద్	405.9	331.8	18
మొత్తం(సగటు)	447.8	303.9	32

ఊరటనిచ్చిన వర్షం

రెండు, మూడు వారాలుగా సరైన వానల్లేక పంటలు ఎండిపోతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి సాగు పెరిగినా.. సీజన్ మొదట్లోనే వర్షాభావం వెంటాడింది. కీలకమైన పంటలు ఎదిగే దశలోనే వరుణుడు ముఖం చాటేయడంతో వరి, మొక్కజొన్న, పెసర, కంది తదితర పంటలు వందలాది ఎకరాల్లో ఎండుముఖం పట్టాయి. పలుచోట్ల రైతులు కొన్ని వరిమడులను వదిలేసి ఉన్నవాటినే కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులకు తోడు ఎండలు మండిపోవడం మరింత ఇబ్బందికరంగా మారింది. చేలల్లో ఉన్న కాస్త తడిని భగభగ మండుతున్న భానుడు ఆవిరి చేశాడు. సీజన్ ప్రారంభంలో భరోసాగా నీరందించిన బోరుబావులు.. ఇప్పుడే ఎత్తిపోతుండటం రైతులను మరింత కలవరానికి గురి చేస్తోంది. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇస్తుండటంతో రైతులు పోటీ పడి మోటార్లను నడిపిస్తుండటంతో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. కరువు మేఘాలు కమ్ముకుంటున్న దశలో ఈ వర్షం కురవడం రైతుల్లో ఆనందాన్ని నింపింది. ఈ వానలతో పంటలు గట్టెక్కేస్తాయని కాదుగాని.. ఉన్నంతలో పంటలు పూర్తిగా ఎండిపోకుండా మాత్రం కాపాడగలిగాయి. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తేనే పంటలు దిగుబడుల వరకు రావడంతో పాటు చెరువులు, కుంటలకు జలకళ వస్తుంది. లేదంటే కరువు వైపు అడుగులు పడతాయి. వరుణుడు కరుణించాలని పల్లెల్లో రైతులు పూజలు చేస్తున్నారు. శివలింగాలకు జలాభిషేకాలు చేస్తున్నారు. మొగులు మెత్తబడి కరువుతీరా వానలు పడాలని రైతాంగం వేడుకుంటోంది.

జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణను వేగవంతం చేయాలి

సమీక్షా సమావేశంలో ఆర్డీవో మెంచు నగేష్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నగేష్

మెదక్ అర్బన్: మెదక్ జిల్లా మీదుగా 161వ సంగారెడ్డి- అకోలో వరకు నిర్మించే జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణను వేగవంతం చేయాలని ఆర్డీవో మెంచు నగేష్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్లు, సర్వేయర్లచే సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 140 కిలో మీటర్ల మేర నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. రోడ్డు పనుల్లో టేక్మాల్ మండలంలో ఒకటి, అల్లాదుర్గంలోని ఆరు, పెద్దశంకరంపేట మండలంలోని ఆరు గ్రామాల్లో భూ సేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నాటిన మొక్కను సంరక్షించాలి

జాయింట్ కలెక్టర్ సురేష్ బాబు

మెదక్ అర్బన్: మొక్కలు నాటి బాధ్యతగా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని జాయింట్ కలెక్టర్ సురేష్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం హరిత హార కార్య క్రమంలో భాగంగా పట్టణంలోని మీసేవ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీసేవ నిర్వాహకులు రాజు, అజార్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కను నాటి నీళ్లు పోస్తున్న జేసీ

నేడు నులిపురుగు నిర్మూలనపై ర్యాలీ

మెదక్ అర్బన్: జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మెదక్ పట్టణంలో బుధవారం 10 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ర్యాలీని కలెక్టర్ భారతి హోళికేరి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

- జిల్లా సంక్షేమాధికారి మోతి

జహీరాబాద్: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని జిల్లా సంక్షేమాధికారి మోతి అన్నారు. మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జహీరాబాద్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తల్లిపాలలో బిడ్డ ఎదుగుదలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. బిడ్డకు భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తవన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారం కూడా పిల్లలకు ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. తల్లిపాల ప్రాధాన్యతను తెలిపే వారోత్సవాలను అంగన్‌వాడీ టీచర్లు విధిగా కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. అనంతరం సాముహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు.

కాంగ్రెస్ కోటకు బీటలు

- విఫలమయిన మాజీ మంత్రి సునీతారెడ్డి ప్రయత్నాలు
- టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న 'వెల్దుర్తి' రాజకీయ కురువృద్ధులు

వెల్దుర్తి: వెల్దుర్తి మండలంలో కాంగ్రెస్ కంచుకోటకు బీటలు వారాయి. నిన్నటి వరకు వెల్దుర్తిలో కాంగ్రెస్ హవా కొనసాగింది. గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీతో సరిసమానంగా ఎంపీటీసీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసు కుంది. ఆ ఎన్నికల్లో అధికార పార్టీ ఆరు స్థానాలు గెలవగా కాంగ్రెస్ పార్టీ ఆరు ఎంపీటీసీ స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. అయినప్పటికీ టీఆర్ఎస్ ఎత్తులకు కాంగ్రెస్ చిత్తయింది. ఎంపీపీగా టీఆర్ఎస్‌కు చెందిన సునితాప్రతాప్‌రెడ్డి ఎన్నిక య్యారు. వెల్దుర్తి మండలంలో కాంగ్రెస్ 30 ఏళ్లుగా ఏకపక్ష రాజకీయ పార్టీగా కీలకపాత్ర పోషించింది. మండల వ్యవస్థ ఏర్పడినప్పటినుంచి మొట్టమొదటి సారి ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకొని మూడుసార్లు హ్యాట్రిక్ సాధించింది. ఎంపీపీ స్థానాన్ని గెలుచుకొని కాంగ్రెస్ పార్టీ అంటే జిల్లాలోనే వెల్దుర్తి మండలానికి ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ఉమ్మడి జిల్లాలో జడ్పీటీసీ అనంతరెడ్డి వైస్‌చైర్మన్‌గా పదవిని అలంకరించారు. ఇలాంటి సమయంలో 2014లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ సమీకరణలు మారాయి. కాంగ్రెస్‌పార్టీకి చెందిన మాసాయి పేట ఎంపీటీసీ సిద్దిరాములుగౌడ్, ప్రస్తుత ఎంపీపీ ఉపాధ్యక్షురాలు కమలమ్మ, హస్తాల్‌పూర్ సర్పంచ్ పాండురంగాచారితో పాటు పలువురు సర్పంచులు టీఆర్ఎస్‌లో చేరి కాంగ్రెస్‌ని బలహీన పరిచారు. సోమవారం ఏకంగా కాంగ్రెస్ మండల దిగ్గజాలు మంత్రి హరీశ్‌రావు సమక్షంలో జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మన్ అనంతరెడ్డి, మాజీ ఎంపీపీలు శంకర్‌గౌడ్, లక్ష్మీనర్సమ్మతో పాటు సుమారు 500 మంది అనుచరులతో టీఆర్ఎస్‌లో చేరారు. దీంతో మాజీ మంత్రి సునితారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులను చివరి వరకు పార్టీని విడవకుండా ఉండేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో చేసేదేమీలేక మండల కాంగ్రెస్ ద్వితీ య శ్రేణి నాయకులు అవాక్కయ్యారు. వెల్దుర్తి మండల రాజకీయాల్లో ఒక్కసారిగా రాజకీయ సమీకరణలు మారాయి.

పదవులు, డబ్బు కోసమే పార్టీ మారిన నాయకులు

మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆగ్రహం

వెల్దుర్తి: వెల్దుర్తి మండల కాంగ్రెస్ పార్టీలో పలు పదవులు అనుభవించి దశా బ్దాల పాటు పార్టీలో పనిచేసిన జిల్లాపరిషత్ మాజీ వైస్‌చైర్మన్ అనంతరెడ్డి, మాజీ ఎంపీపీలు శంకర్‌గౌడ్, లక్ష్మీనర్సమ్మ పదవులు, డబ్బు, కాంట్రాక్టు పనుల కోసం పార్టీ మారారని జిల్లా కాంగ్రెస్ నాయకులు పడిగ నర్సింలు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, సహకార సంఘం మండల ఉపాధ్యక్షుడు నర్సింలు ఆరోపించారు. బుధవారం వెల్దుర్తిలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. బంగారు తెలంగాణ కోసం పార్టీ మారిన నాయకులు పదవుల కోసం అప్పుడే పార్టీ మారితే బాగుండేదని విమర్శించారు. పదవులు, డబ్బుకోసం, స్వార్థ అవసరాల కోసమే పార్టీ మారారని వారు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ బిక్షతో పదవులు సంపాదించుకున్న వీళ్లు ముందుగా తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో పలు పదవులు అనుభవించి తమ సొంత లాభం కోసం పార్టీ మారడం సిగ్గుచేటని ఆరోపించారు. వెల్దుర్తి మండలంలో మంత్రి హరీశ్‌రావు చేసిన ప్రారంభోత్సవాలకు గతంలోనే మంత్రి సునితారెడ్డి నిధులు మంజూరు చేసిందని వారు గుర్తుచేశారు. అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వెల్దుర్తికి రాగా రూ.35 కోట్ల నిధులతో నాగులపల్లి చౌరస్తా నుంచి వెల్దుర్తి మీదుగా నర్సాపూర్ వరకు రెండు వరుసల రహదారికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు.


'రెవెన్యూ అధికారుల మాయాజాలంతో తీవ్రంగా నష్టపోయాం'

కౌడిపల్లి: కూకుట్లపల్లి గ్రామానికి చెందిన వీఆర్‌వో సోమరాజు చేసిన రెవెన్యూ మయాజాలంతో తాము ఎన్నో సమస్యల్లో చిక్కుకున్నామని ఆ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నాడు ఆ గ్రామానికి వెళ్లిన ఆంధ్రజ్యోతితో జంగం భట్టయ్య, జెక్కి బాలయ్య, సత్యనారాయణ, గొల్ల భూమయ్య, పోచమ్మ తదితరులు వీఆర్‌వో అవినీతి ఆగడాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే నెంబరు 177లో 50 సంవత్సరాలుగా కాస్తు చేస్తూ పట్టాలు పొంది ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారి రియల్ వ్యాపారులతో చేతులు కలిపి తమ పట్టా భూములను లాక్కునేందుకు ప్రయత్నం చేస్తున్నారని వారు ఆవేదన చెందారు. రెవెన్యూ అధికారి స్వార్థపూరిత విధానాల వల్ల తమ కుటుంబాలు భూములు కోల్పోయి రోడ్డున పడే దుస్థితులు దాపురించాయని అన్నారు. తాతల కాలం నుండి 177 సర్వే నెంబరులో 34 ఎకరాల భూమిని దున్నుకొని జీవనం గడుపుతున్నామని అన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు కల్గి ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారి డబ్బులకు అమ్ముడుపోయి ఇతరులకు భూమిని కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నాడని వారు ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాన్నారు.

కోర్టు చెక్కు ఇచ్చింది.. బ్యాంకు డబ్బుల్లేవంది!

- నష్టపరిహారంపై బీమా కంపెనీతో మూడేళ్లు పోరాడి గెలిచిన నారాయణ
- కోర్టు ఇచ్చిన చెక్కును నిలిపివేసిన బ్యాంకు అధికారులు

మెదక్ రూరల్: రోడ్డు ప్రమాదంలో అంగవైకల్యం పొందిన ఓ వృద్ధుడు నష్టపరిహారం కోసం మూడేళ్లు కోర్టులో బీమా కంపెనీపై పోరాటం చేశాడు. చివరికి విజయం సాధించి నష్టపరిహారాన్ని చెక్కు రూపంలో పొందాడు. తీరా బ్యాంకుల్లో జమ చేస్తే సాంకేతిక సమస్య పేరుతో నిలిపివేశారు. మూడేళ్లుగా పోరాటం చేసి వైద్య ఖర్చుల కోసం చేతికి డబ్బులు వచ్చాయని ఆశపడ్డ ఆ వృద్ధుడికి బ్యాంకర్లు నిరాశే మిగిల్చారు. దీంతో ఎవరికీ చెప్పలేక బోరుమంటున్నాడు. దేవుడిలా కోర్టులు వరమిస్తే పూజారి అడ్డు తగిలినట్లుగా బ్యాంకర్ల తీరుపై మండి పడుతున్నారు. హవేళీ ఘణపూర్ మండలం చౌట్లపల్లికి చెందిన ధర్మారం నారాయణ 2014 జనవరి 28న రోడ్డు ప్రమాదంలో వాహనం ఢీ కొని గాయాలపాలయ్యాడు. ప్రమాదంలో అంగవైకల్యం పొందిన నారాయణ నష్టపరిహారం కోసం కోర్టును ఆశ్రయించాడు. మూడేళ్లు పోరాటం చేసి చివరికి బీమా కంపెనీపై గెలుపొందాడు. మెదక్ న్యాయమూర్తి బాధితుడు నారాయణకు రూ.4.98 లక్షలు నష్టపరిహారం చెల్లించే విధంగా తీర్పునిచ్చారు. ఇందుకు కోర్టు ఖాతా నుంచి బాధితుడు నారాయణకు రూ.2.49 లక్షల ఎస్‌బీఐ చెక్కును అందజేశారు. కోర్టు ఇచ్చిన చెక్కును నారాయణ మెదక్ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు ఖాతాలో ఈ



చెక్కును నిలిపివేస్తున్నట్లు బ్యాంకు ఇచ్చిన రసీదు



బాధితుడు నారాయణ

నెల 1 న జమ చేశాడు. ఖాతాలో డబ్బులు జమ కాక పోవడంతో బ్యాంకు వే ం నే జ ర్ న ం సంప్రదించగా చెక్కు తిరిగి వచ్చినట్లుగా తెలిపాడు. క్లియరెన్స్ లేకపోవడం వల్ల డబ్బు జమ కాలేదని వివరించాడు. పోరాటంలో గెలిచిన నారాయణ 75 ఏళ్ల వయసులో వచ్చిన డబ్బులు వైద్యం కోసం ఖర్చు చేద్దామనుకుంటే బ్యాంకులు అడ్డుగా నిలవడంపై ఆవేదన వ్యక్తం చేశాడు. రోడ్డు ప్రమాదం వల్ల నష్టపోయిన తాను కనీసం మెరుగైన వైద్యం తీసుకుందామంటే బ్యాంకు ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. కోర్టు ఇచ్చిన చెక్కులే చెల్లకుంటే ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సాంకేతిక సమస్య పేరుతో నిలిపివేత

రోడ్డు ప్రమాదాలు, భూ సేకరణ ద్వారా మంజూరైన డబ్బులు అందజేయడానికి బ్యాంకులు సాంకేతిక సమస్య కారణంగా చూపుతున్నారు. జిల్లా కోర్టు నుంచి రోడ్డు ప్రమాదాలు, భూ సేకరణకు సంబంధించిన 11 చెక్కులు వెళ్లగా అదే విధంగా తిరిగి పంపినట్లు బాధితులు చెబుతున్నారు. కోర్టు ఇచ్చిన తీర్పులో బీమా కంపెనీలు డబ్బుల్ని న్యాయమూర్తి ఖాతాల్లో జమ చేస్తారు. ఆ డబ్బుల్ని సంబంధిత బాధితులకు స్వయంగా న్యాయమూర్తే చెక్కు ద్వారా పంపిణీ చేస్తారు. ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఉండవు. సందరు కంపెనీ ఇచ్చిన డబ్బులే కోర్టు తీర్పు ప్రకారం అందజేయాల్సి ఉంటుంది. అయితే ఇందులో ఎలాంటి తిరకాసు లేకున్నా బ్యాంకర్లు, ట్రెజరీ అధికారులు ఉద్దేశ పూర్వకంగానే చెక్కులు పాస్ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏళ్లుగా పోరాటం చేసి న్యాయంగా గెలుపొందిన డబ్బు ఇవ్వడంలో అడ్డంకులు సృష్టించడం సరికాదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

చెక్కులను ఎలా ఆపుతారు

- సీనియర్ న్యాయవాది ప్రతాప్‌రెడ్డి



కోర్టు నుంచి వచ్చిన చెక్కులను సాంకేతిక కారణాలు చూపుతూ నిలిపివేయడం సరైంది కాదు. కోర్టుల్లో సదరు ఇన్సూరెన్స్ కంపెనీ డబ్బు జమ చేస్తుంది. ఆ డబ్బుని న్యాయమూర్తులు చెక్కుల ద్వారా పంపిణీ చేస్తే బ్యాంకులు ఎందుకు నిలిపివేశాయి. కోర్టు చెక్కును ఆపిన దానిపై బ్యాంకులపై కోర్టుకు ఫిర్యాదు చేస్తాం.

వివాదాస్పదంగా మారిన

నాగ్సాన్‌పల్లి ప్రభుత్వ భూములు

- 57 మందికి షోకాజ్ నోటీసులు
- ఆందోళనలో గ్రామస్థులు

కౌడిపల్లి: కౌడిపల్లి మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి శివారులోని ప్రభుత్వ భూమి వివాదాస్పదంగా మారింది. నాగ్సాన్‌పల్లి శివారులోని ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 92లో గల 157 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని ఆర్డీవో ఇటీవల ఫౌల్ట్రీఫాం యజమానితో పాటు 57 మంది కబ్జాదారులకు సంజాయిషీ నోటీసులు జారీ చేవారు. ఈ నేపథ్యంలో 57 మంది కబ్జాదారులు ఈనెల 5న నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంకు హాజరై కబ్జా చేసిన భూముల వివరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామంలో ఎలాంటి నివాసం లేని ఆరుగురు వ్యక్తులు సర్వే నెంబరు 92, 93, 94 ప్రభుత్వ భూమిలో అసైన్డ్‌మెంటు ద్వారా పట్టాలు పొందారని గ్రామస్థులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా నాగ్సాన్‌పల్లి శివారులో గల ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 92లో అసైన్డ్‌మెంటు కమిటీ ద్వారా పట్టాలు పొందిన పలువురు లబ్ధిదారులు 30సంవత్సరాలుగా భూమిని దున్నుకొని జీవనం గడుపుతున్నామని అధికారులకు వివరించారు. రెవెన్యూ ఉన్నతాధికారుల అండదండలతో గ్రామానికి సంబంధం లేని ఆరుగురు వ్యక్తుల పేరుతో 92 సర్వే నెంబరులో పట్టాలు పొందారని అధికారులకు వివరించారు. ఇదే క్రమంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిలో ఓ రియల్ వ్యాపారి ఫౌల్ట్రీఫాం నిర్మించారని అన్నారు. ఏదిఏమైనా నాగ్సాన్‌పల్లి శివారు ప్రాంతంలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవడంపై రెవెన్యూ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకొని ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కబ్జాకు పాల్పడి నిర్మించిన ఫౌల్ట్రీఫాంను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా భూమినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న సర్వే నెంబరు 92లో నాగ్సాన్‌పల్లికి చెందిన నిరుపేద రైతులకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

కబ్జాకు గురైన ఫౌల్ట్రీఫాంలో ఐదు ఎకరాల భూమి కోల్పోయాను

-రవీందర్, రైతు,నాగ్సాన్‌పల్లి



నాగ్సాన్‌పల్లి శివారులో కబ్జాకు పాల్పడిన ఫౌల్ట్రీఫాంలో తాను సాగు చేసిన ఐదు ఎకరాల భూమి కోల్పోయానని ఆ గ్రామ రైతు రవీందర్ పేర్కొన్నారు. తాతల కాలం నుండి సర్వే నెంబరు 92లో ఐదు ఎకరాల భూమిని దున్నుకొని జీవనం గడిపామని, తిరిగి తన భూమి తనకు ఇప్పించాలని బాధిత రైతు కోరారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ముందస్తు ఎల్‌వోసీలతో ప్రాణాలు కాపాడుతున్న ప్రభుత్వం
- రూ.2.90 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి

మెదక్ మున్సిపాలిటీ: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుం దని టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉపసభాపతి క్యాంపు కార్యాలయంలో రూ.2.90 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు లను పది మంది లబ్ధిదారులకు ఆయన అందజేశారు.

అనంతరం ఆయన మాటా డుతూ.. గత ప్రభుత్వాల హయాంలో ఆస్పత్రి ఖర్చులను బిల్లులుగా అందజేస్తే మంజూరు చేసేవారని, టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అత్యవసర సమయాన్ని గుర్తించి ఎల్‌వోసీలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ విధానం ప్రమాద తీవ్రత ఉన్న బాధితులకు పూర్తి భరోసా లభించిందన్నారు. ఇంతేకాకుండా ఎన్నో రకాల సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారని కొనియాడారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ లావణ్యారెడ్డి, వైస్ చైర్మన్ రాగి అశోక్, ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు ఉస్మాన్, చింతల నర్సింలు, లింగారెడ్డి, నాగప్ప తదితరులు ఉన్నారు.



ఉపసభాపతి క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న దేవేందర్‌రెడ్డి

సినిమాలు

నర్సాపూర్

సాయి	ఫిదా
శ్రీనివాస	గౌతమ్‌నంద

రామాయంపేట

సంతోష్	నక్షత్రం
సాయిరామ్	ఫిదా

పెద్దశంకరంపేట

లక్ష్మి	బాహుబలి-2

మెదక్

సినీమ్యాక్స్	ఫిదా
గంగినేని	గౌతమ్‌నంద
సాగర్	నక్షత్రం

వరిపంటకు తాటాకు తెగుళ్లు

- ఆందోళనలో రైతులు
- తడిసి మోపెడవుతున్న పెట్టుబడి ఖర్చులు
- ఎన్ని మందులు వాడినా ఫలితం శూన్యం

హవేళీఘణపూర్: వర్షాకాలం పంటలు రైతులు కోటిఆశలతో పంటలసాగుకు సిద్ధమయ్యారు. వర్షాకాలం ప్రారంభంలో రెండు భారీవర్షాలు పడడంతో రైతన్నలు బోరుబావుల దగ్గర వరినాట్లను మొదలుపెట్టారు. ముందుగానే నాట్లు వేయడం ద్వారా పంట ఆశించిన స్థాయిలో వస్తుందని రైతులు ముందుగానే నాట్లు వేశారు. కానీ నాట్లు వేసిన వరిపైరుకు తెగుళ్లు సోకుతున్నాయి. దీంతో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మొదట ఆకుపచ్చ పురుగు పంటకు సోకడంతో మందులు స్ర్పేచేయగా తగ్గుముఖం పట్టాయి. తెగుళ్లు పోయాయన్న సమయంలో మళ్లీ మొగ్గి పురుగు, వరి ఆకులు తెల్లబడిపోతున్నాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యాధిసోకిన పంట రోజురోజుకూ కుంగిపోతుందని పలువురు రైతులు వాపోతున్నారు. మండలపరిధిలోని బూర్గుపల్లి, రాజిపేట, ముత్తాయిపల్లి, ఫరీద్‌పూర్, ఔరంగాబాద్, తొగిటతదితర గ్రామాల్లో రైతులు వేసుకున్న పంటలకు వ్యాధులు సోకడంతో దిగుబడి తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాట్లు వేసేందుకు పెట్టుబడి ఎక్కువకావడంతో ఖర్చులు అధికమయ్యాయి. వ్యాధులుసోకడం వల్ల దాని నివారణకు వేల రూపాయలు ఖర్చుచేసి మందులు తెచ్చి స్ర్పేచేసినా ఫలితం లేదంటున్నారు. మళ్లీ మళ్లీ మందులు కొనుగోలు చేయడానికి డబ్బులు లేవంటూ వాపోతున్నారు. ఇలాగైతే పంటలు ఎలా చేతికొచ్చేదని రైతులు భయాందోళనకు గురవుతున్నారు.



తెగుళ్లు సోకిన వరి పంటకు పురుగు మందు స్ర్పే చేస్తున్న రైతు రాములు

ఆశించిన దిగుబడి రావడం కష్టమే



-మల్లయ్య, రైతు, ముత్తాయిపల్లి

వరిపంట వేసి నెలా పదిహేను రోజులు అయింది. ఏపుగా పెరుగుతుందని అనుకున్నా కానీ ఆకుపచ్చ పురుగు వరి పంటకు సోకి మొత్తం నాశనం చేస్తోంది. పంటను కాపాడుకునేందుకు మందులు కొనుగోలు చేసి స్ర్పే చేస్తున్నాను. కానీ ఆశించిన దిగుబడి వస్తుందో రాదని బాధగా ఉంది.

వరి పంటకు తాటాకు తెగుళ్ల వ్యాధి



-నాగమాధురి, వ్యవసాయాధికారిణి

వరిపంటకు ఆకులు తెల్లగా అయి కుంగిపోతున్నట్టు కనిపిస్తే ఆ వ్యాధిని తాటాకు తెగుళ్ల అంటారు. దీన్ని నివారణకు రైతులు ముందుగా గట్ల మీద, పొలంలో కలుపులేకుండా శుభ్రం చేసుకోవాలి. రైతులు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదిస్తే పూర్తి సమాచారం అందిస్తాం.

పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి



-సత్యం, రైతు, బొగుడ భూపత్‌పూర్

ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి నారుపోయడం జరిగింది. దుక్కులుదున్నడానికి కూలీల నుంచి పంట నాట్లు వేసేవరకు పెట్టుబడి ఖర్చులు బాగానే ఖర్చయ్యాయి. వరికి తెగుళ్ల సోకి పురుగు మందు కొనుగోలు చేయడం ద్వారా పెట్టుబడి మరింత పెరుగుతోంది.



మెరిట్ విద్యార్థికి బహుమతిని అందజేస్తున్న బాబురావ్

లయన్స్ సేవలు విస్తరిస్తాం

- కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో క్లబ్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్ బాబురావ్

రామాయంపేట: లయన్స్ సేవలు మరింతగా విస్తరిస్తామని ఆ క్లబ్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్ బాబురావ్ అన్నారు. మంగళవారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్లో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన బాబురావ్ ఏర్పాటైన సభలో మాట్లాడుతూ రక్తదానం, అవయవ దానాలపై తమ క్లబ్‌లు ప్రజల్లో చైతన్యం తెస్తున్నాయన్నారు. ఇప్పటికే సమాజంలో సేవాకార్యక్రమాల్లో దూసుకపోతున్న లయన్స్‌క్లబ్‌లు ప్రభుత్వం చేపట్టే హరితహారంలోనూ పాలుపంచుకున్నామన్నారు. సభలో లయన్స్ జిల్లా పాస్ట్ గవర్నర్ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు సహాయాన్ని అందజేస్తున్నామన్నారు. ఇప్పటికే సంస్థ పక్షాన ఉచిత రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామని జిల్లా క్లబ్ ఛైర్మన్ ఏలేటి రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. దీనిలో క్లబ్ ప్రతినిధులు కైలాస్, నవాత్‌సురేష్, జితేందర్‌రెడ్డి ఉన్నారు.

'పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణను పెట్టాలి'



ఆర్డీవో నగేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

మెదక్ అర్బన్: పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ మెదక్‌లో చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారంతో ముగిసినట్లు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎస్ జిల్లాఅధ్యక్షుడు బాల్‌రాజ్ తెలిపారు. షెడ్యూల్ కులాలు, ఏబీసీడీ వర్గీకరణ పార్లమెంటులో బిల్లుపాస్ చేయించేలా రాష్ట్రప్రభుత్వానికి మెదక్ ఆర్డీవో, తహసీల్దార్ అధికారుల ద్వారా వినతిపత్రం వినతిపత్రం అందజేశామన్నారు. వీరి దీక్షలకు జేఏసీ జిల్లా ఛైర్మన్ సడిమెల యాదగిరి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మధు, ప్రవీణ్, కుమార్, నాని, మహేష్, కిషన్, రవి, రాజు, శంకర్, సాయిబాబా, ప్రభుదాస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు శరత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడో రోజుకు ఎమ్మార్పీఎస్ దీక్షలు

రామాయంపేట: ఏబీసీడీ వర్గీకరణ కోసం తలపెట్టిన ఎమ్మార్పీఎస్ దీక్షలు ఏడో రోజుకు చేరాయి. సోమవారంనాడూ ఈ దీక్షలు కొనసాగించారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ఇందుకు సంబంధించిన బిల్లు పెట్టాలంటూ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు ఈ ఆందోళన కొనసాగుతోంది. ఇప్పటికే రెండు దశాబ్దాలుగా నడుస్తున్న వర్గీకరణ ఉద్యమాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బిల్లు పెట్టితీరాల్సిందేనంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు మల్యాల కిషన్, గంగాపురం సంజీవ్, ఎర్ర రమేష్, నర్సగల్ల స్వామి, అశోక్‌లు డిమాండ్ చేశారు.



ఎమ్మార్పీఎస్ దీక్షల్లో పాల్గొన్న కార్యకర్తలు

అభాసుపాలవుతున్న హరితహారం

- నాటాల్సిన మొక్కలు వృధాగా...
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు

మెదక్ అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూడోవిడత హరితహారం కార్యక్రమం మెదక్‌లో అభాసుపాలవుతోంది. నాటాల్సిన మొక్కలు వృథాగా పారేస్తున్నారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ఫలితంగా నాటేందుకు మొక్కలను నాలుగురోజుల నుంచి ప్రభుత్వ న్యూ హైస్కూల్ పాఠశాల ఆవరణలో వృథాగా ఉంచారు. పట్టణంలో వివిధ వార్డుల్లో మొక్కలు నాటాలని నిర్ణయించారు. కొన్ని వార్డులలో తూతూ మంత్రంగా మొక్కలు నాటి చేతులు దులుపుకున్నారు. అధికారులు, సిబ్బంది మొక్కలు నాటుతున్నారనే దానిపై శ్రద్ధ చూపకపోవడంతో కొన్నిచోట్ల మొక్కలు నాటేందుకు గుంతలు తీసి వదిలేశారు. అటువైపు ప్రత్యేకాధికారులు కన్నెత్తి చూడడంలేదు. ఓపక్క హరితహారం కార్యక్రమం కొనసాగుతున్నా మరోపక్క నాటేందుకు తీసుకువచ్చిన మొక్కలను వృథాగా వదిలేశారు. కొన్ని మొక్కలు నేలపాలవుతున్నాయి. నాటిన మొక్కలను సంరక్షించాలని చెప్తున్న అధికారులు వృథా మొక్కలను పట్టించకోకపోవడమేంటని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వృథాగా ఉన్న మొక్కలను నాటాలని కోరుతున్నారు.



న్యూహైస్కూల్‌లో వృథాగా పడిఉన్న మొక్కలు

తట్టు రూబెల్లా వ్యాధులపై అంగన్‌వాడీలకు అవగాహన

పెద్దశంకరంపేట: 17 నుంచి ప్రారంభం కానున్న తట్టు రూబెల్లా వ్యాక్సిన్‌ల టీకాల పంపిణీపై అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం మండల వైద్యాదికారి శంకర్ చింతల అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు, చిన్నారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. అందరూ సమష్టిగా కలసి పని చేయాలన్నారు. సిబ్బంది భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్టు పంపిణి

పేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేయించుకున్న మహిళకు మంగళవారం మండల వైద్యాధికారి శంకర్ చింతల కేసీఆర్ కిట్టు పంపిణీ చేశారు. ఆయన వెంట ఏఎన్ఎం సునీత ఉన్నారు.

వరిపంటకు అగ్గితెగుళ్లు - మందులు సూచిస్తాం

- ఏడీ మనోహర

మెదక్ రూరల్: వరి పంటకు అగ్గితెగుళ్ల సోకిందని వ్యవసాయశాఖ ఏడీ మనోహర పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పాతూర్, అవుసులపల్లి గ్రామాల శివారులోని వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ ప్రభావం వల్ల వరికి అగ్గితెగుళ్ల సోకినట్లు తెలిపారు. ఈ తెగుళ్ల పైరిక్యూలేరియా గ్రిజియా అనే శిలింధ్రం ద్వారా ఆశిస్తుందన్నారు. నారుమడిలో నాట్లు పైరుపై లాలి దశలో ఆకుపై నూలుకండి ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమంగా అనుకూల వాతావరణంలో ఇవి పెద్దవిగా మారి మచ్చలు, చివర్లు, మోన దశలో ఉంటాయన్నారు. ఈ మచ్చల అంచులు ముదురు గోధుమ రంగు లేదా పసుపు రంగులో ఉండి మచ్చల మధ్య భాగంలో బూడిద, తెలుపు రంగుల్లో ఉంటాయని తెలిపారు. అనుకూల వాతావరణ పరిస్థితుల్లో మచ్చలు ఒకదానికోటి కలిసిపోయి ఆకులు పార్శికంగా పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. పిలక దశలో ఆకులపైన ఉన్న మచ్చలు క్రమేపీ మొక్కకనువులకు సోకడం వలన ఆ భాగం ముదురు రంగు లేదా నల్లగా మారి చివరికి కనువులు కుళ్లిపోతాయని పేర్కొన్నారు. ఇందుకు సరైన మోతాదులో నివారణ చర్యలు తీసుకుంటే అగ్గి తెగుళ్ల నివారించవచ్చని పంటకు తెగుళ్ల సోకిన వారు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదిస్తే తగు మందులను సూచిస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట వ్యవసాయాధికారి రెబల్‌సన్ తదితరులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వాటర్‌షెడ్ ద్వారా రూ.1.7 కోట్ల నిధులు

- భూగర్భ జలాలు పెంచేందుకే పనులు
- రెండు నెలల్లో పూర్తి చేస్తాం
- టీఏ జగదీశ్వర్

రేగోడు : వాటర్‌షెడ్ పథకం కింద రూ.1.74 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నట్లు వాటర్‌షెడ్ టెక్నికల్ అసిస్టెంట్ జగదీశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కొండాపూర్ ప్రాజెక్టు కింద రేగోడు మండలంలోని 12 గ్రామాలను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. వాటర్‌షెడ్ గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఈ పథకం గత ఏడాది ముగిసినప్పటికీ మిగులు బడ్జెట్ ఉండడంతో పనులు చేయించాలని జిల్లా అధికారుల ఆదేశాలమేరకు రెండు నెలల్లో పనులు పూర్తి చేయిస్తామని అన్నారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేలా పథకాలు చేపడతామని తెలిపారు.

ఊటకుంటలు చెక్‌డ్యాంలు, రాతి కట్టలు, తదితర పనులు చేయించేందుకు ప్రతి పాదనలు చేపట్టామని అన్నారు. గ్రామాల వారిగా మిగులు నిధుల వివరాలు వెల్లడించారు. రేగోడ రూ. 25.63 లక్షలు పోచారం రూ. 6.34 లక్షలు బురన్‌వాడి తండా రూ. 7.16 లక్షలు చౌదర్‌పల్లి రూ. 16.21 లక్షలు, కొండాపూర్ రూ. 12.71 లక్షలు జగిర్యాల రూ. 13.43 లక్షలు, మక్తవెంకటాపూర్ రూ. 6.96 లక్షలు ప్యారారం రూ. 14.33 లక్షలు ఆర్.ఇటిక్యాల రూ.19.71 లక్షలు టి.లిం గంపల్లి రూ. 18.54 లక్షలు తిమ్మాపూర్ రూ. 14.84 లక్షలు ఉన్నాయని తెలిపారు. ఈ నిధులతో పనులు నాణ్యతగా చేయిస్తామని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న వాటర్ షెడ్ అధికారులు

కొత్తగా గజవాడ ప్రాజెక్టు మంజూరు

వాటర్‌షెడ్ ద్వారా కొత్తగా గజవాడ ప్రాజెక్టు మంజూరైందని టీఏ జగదీశ్వర్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు రూ. 3.38 కోట్లు నిధులు వస్తున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద గజవాడ, దోసపల్లి, తాటిపల్లి గ్రామాలతో పాటు వట్‌పల్లి మండలంలోని దుద్యాల, మేడికుంద, గ్రామాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీవో గంగారం, వాటర్‌షెడ్, టీవో రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



బయోమెట్రిక్ విధానం ద్వారా రేషన్ సరుకులను అందజేస్తున్న ఆనందరావు

బయోమెట్రిక్‌ను ప్రారంభించిన తహసీల్దార్

నిజాంపేట: నిజాంపేట మండలంలోని నందిగామగ్రామంలో బయోమెట్రిక్ ద్వారా రేషన్ సరుకులను తహసీల్దార్ ఆనంద్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మొత్తం మండలంలో 18 షాపులకు బయోమెట్రిక్ మిషన్లు అందజేశామన్నారు. ప్రతినెల 15వ తేదీలోపు రేషన్ సరుకులు వినియోగదారులు పొందాలని, లబ్ధిదారులు తమయొక్క ఆధార్ నెంబర్‌ను బయోమెట్రిక్‌కు అనుసంధానం చేయడం జరిగిందన్నారు. దీన్ని ద్వారా లబ్ధిదారులందరికీ సక్రమంగా సరుకులు అందుతాయని తెలిపారు. బయోమెట్రిక్ విధానాన్ని ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.

ఎమ్మార్పీఎస్ వంటా-వార్పు

చిన్నశంకరంపేట: ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు ఐదో రోజుకు చేరాయి. మంగళవారం దీక్ష శిబిరం వద్ద వంటవార్పు కార్యక్రమం చేపట్టి వినూత్న రీతి లో నిరసన వ్యక్తం చేశారు. ఏబీసీడీ వర్గీకరణ అయ్యేంత వరకు నిరసనలు ఆగవని ఎమ్మార్పీఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు మురళీమాదిగ అన్నారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు దైనికరి స్వామి, కర్రె స్వామి, ఆర్‌పీఎం రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

- భయం భయంగా రైతులు

మెదక్ అర్బన్: విద్యుత్ ఆధునీకరణ పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్తున్నప్పటికీ పట్టణ ప్రాంత శివారులో తీగలు కిందకు వేలాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు కిందకు వేలాడుతున్న మరమ్మతులు చేయడం లేదు. పట్టణ శివారులోని రేణుక ఎల్లమ్మగుడి వెనక చాలారోజులుగా తీగలు కిందకు వేలాడుతుండడంతో ఆ ప్రాంతం గుండా రైతులు నడవడానికి జంకుతున్నారు. పశువుల కాపర్లు అటువైపు వెళ్లాలంటే భయపడుతున్నారు. వేలాడుతున్న తీగలతో ప్రమాదం పొంచి ఉన్నా సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడంలేదు. ఈ తీగల విషయంపై లైన్‌మన్‌కు తెలిపినప్పటికీ మరమ్మతులు చేయడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వేలాడుతున్న తీగలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



కిందకు వేలాడుతున్న తీగలను చూపుతున్న యువకుడు

గుంతను పూడ్చండి ప్రాణాలు కాపాడండి



ప్రమాదకరమైన మడూర్ చౌరస్తాలోని గుంత

చిన్నశంకరంపేట: గుంతను పూడ్చండి ప్రాణాలను కాపాడండి అంటూ మడూర్ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మడూర్ గ్రామం ప్రధాన దారి (చౌరస్తా) మిర్జాపల్లి రోడ్డుకు మధ్యభాగాన మిషన్ భగీరథకు చెందిన పైప్‌లైన్ గుంత ప్రమాదకరంగా మారింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో.. ప్రజలకు శాపమో.. కానీ ఈ గుంతపక్క నుంచి ప్రజలు వెళ్లాలంటే ప్రమాదకరమే. పనులు పూర్తిచేసి, గుంతను పూడ్చాలంటే మరెన్ని రోజులు ఆగాలని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిర్జాపల్లికి దగ్గరిదారి కావడంతో చాలామంది మిర్జాపల్లి, నార్సింగి హైవేకు (షార్ట్ రూట్) వెళ్లాలంటే ఈ దారినుంచే వెళ్తారు. వారే కాకుండా గ్రామస్థులు అవసరాల నిమిత్తం ప్రతిరోజు వందలాది మంది ఈ ప్రమాదకర గుంతపక్క నుంచే నడవాల్సిందే. రాత్రివేళల్లో గుంత లోపడి చస్తామేమోనంటూ భయాందోళనకు గురవుతున్నామంటున్నారు. సదరు కాంట్రాక్టర్‌కు సంబంధించిన వ్యక్తితో సమస్య గురించి తెలిపినప్పటికీ వారం రోజులు గడిచినా స్పందనే లేదని వాపోతున్నారు. ప్రమాదకరంగా మారినగుంతను వెంటనే పూడ్చివేయాలంటూ గ్రామస్థులు కోరుతున్నారు.

సూపర్‌వైజర్‌తో ఫోన్‌లో మాట్లాడాను

- యశోదభూపాల్, సర్పంచ్

వారం రోజుల నుంచి గుంత ప్రమాదకరంగా ఉంది వాస్తవమే. వెంటనే పూడ్చివేయాలని సదరు సూపర్ వైజర్‌కు తెలిపాను. పైప్‌లైన్ జాయింటర్ లేనందున కొంచెం ఆలస్యమైందని, రెండు, మూడురోజుల్లో పూడ్చేస్తానన్నారు.

కొత్తది పాతారు.. పాతది వదిలేశారు

- ప్రమాదాలకు నిలయంగా మారుతున్న తొలగించిన స్తంభం

పాపన్నపేట: వేలాడుతున్న వైర్లను సరిచేసే క్రమంలో విద్యుత్ సిబ్బంది నూతన స్తంభాలు వేసి పాత స్తంభాలను నేలపైనే వదిలేయడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

మండలకేంద్రం పాపన్నపేటలోని ప్రధాన రహదారి పొడవునా వేలాడుతున్న వైర్లతో ప్రమాదాలు పొంచిఉన్న నేపథ్యంలో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు పాత విద్యుత్ పోల్స్ స్థానంలో కొత్త విద్యుత్ పోల్స్‌ను అమర్చారు. అలాగే వేలాడుతున్న వైర్లను కూడా తొలగించి నూతనవైర్లను బిగించి ప్రమాదాలు జరగకుండా చేశారు. ఇంతవరకు విద్యుత్ అధికారుల తీరు బాగానే ఉన్నప్పటికీ అప్పట్లో వేసిన పాత ఇనుప స్తంభాలను పూర్తిగా తొలగించకుండా రోడ్డుపక్కకు వంచి వదిలేశారు. నేలకు వంచి వదిలేసిన స్తంభాలు వాహనచోదకులకు ఇబ్బందిగా మారి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. పాత పోల్స్‌ను వెంటనే తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పాపన్నపేట గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిపై తొలగించకుండా వదిలేయగా ప్రమాదకరంగా మారిన విద్యుత్‌స్తంభం

'కంచెను ఏర్పాటు చేయాలి'

రేగోడు : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కంచెలు లేక ప్రమాదాలను సూచిస్తున్నాయి. మండలంలో రేగోడ గజవాడ సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. గ్రామాలకు వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె లేక ప్రమాదకరంగా మారాయి. వీటికితోడు గతంలో ఏర్పాటుచేసిన విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారి తీగలు కిందకు వేలాడుతున్నాయి. జిల్లాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేసినా రేగోడు మండలంలో ఎందుకు బిగించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటుచేసి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

'ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి'

గజ్వేల్ అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలోని ప్రజ్ఞాపూర్, రిమ్మనగూడ జడ్పీహెచ్ఎస్‌లలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవులను 240 రోజులకి పెంచాలని కోరారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి దక్కేదెవరికో..?

- కౌడిపల్లి మండలానికి చెందిన ఓ మాజీ సర్పంచ్‌కు ఛాన్స్ ?
- ఒకటిరెండు రోజుల్లో పాలకవర్గం నియమించే అవకాశం



నర్సాపూర్ మార్కెట్ కమిటీ కార్యాలయం

నర్సాపూర్: ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న నర్సాపూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గ నియామకం ఒకటిరెండు రోజుల్లో భర్తీ కానుంది. ఇప్పటికే జిల్లాలోని అన్ని మార్కెట్ కమిటీ పాలకవర్గాలు భర్తీ కాగా నర్సాపూర్ ఒక్కటే వాయిదా పడుతూ వస్తోంది. దీంతో నర్సాపూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని కూడా ఒకటి రెండురోజులలో ప్రకటించాలని నిర్ణయించడంతో పాలకవర్గంలో పదవుల ఎంపిక ఒక్కొక్కటిగా జరుగుతుంది. ఇప్పటికే వైస్‌చైర్మన్ పదవిని శివ్వంపేట మండలం గోమారానికి చెందిన మాధవరెడ్డి పేరు ఖరారు చేస్తూ ఆయన పేరును ఎమ్మెల్యే ప్రకటించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఇక మార్కెట్ కమిటీచైర్‌పర్సన్ పదవి గిరిజన మహిళకు కేటాయించడంతో ఆ పదవి ఎవరికి దక్కుతుందా అనే అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వైస్‌చైర్మన్ పదవి శివ్వంపేట మండలంకు వెళ్లగా ఛైర్‌పర్సన్ పదవిని నర్సాపూర్, కౌడిపల్లి మండలాలకు చెందిన వారికి వచ్చే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఇప్పటికే ఛైర్‌పర్సన్ పదవిని ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు ఇతర ముఖ్య నేతలు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే సొంత మండలమైన కౌడిపల్లి మండలానికి చెందిన మాజీ సర్పంచ్‌గా పనిచేసిన గిరిజన మహిళను నియమించాలని దాదాపు పేరు ఖరారు చేసి ఒకటి రెండు రోజులలో మొత్తం పాలకవర్గాన్ని అధికారికంగా ప్రకటించాలని కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఏదిఏమైనా గత ఏడాదిగా నర్సాపూర్ మార్కెట్‌కమిటీ పాలకవర్గం ఇదిగో అదిగో అంటూ వస్తుండగా ఎట్టకేలకు ఇపుడు మోక్షం లభించింది. ఇదిలా ఉండగా నర్సాపూర్ ఆత్మకమిటీ చైర్మన్ పదవిని రుస్తుంపేట గ్రామానికి చెందిన శివకుమార్‌కు, నర్సాపూర్ శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ చైర్మన్‌గా వీరప్ప పేర్లు కూడా ఖరారైనట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఇదిలా ఉండగా శివ్వంపేట మండలం గోమారం గ్రామానికే రెండు ప్రధాన నామినేటెడ్ పదవులు కేటాయించడంపై టీఆర్ఎస్‌లో ఇతర ప్రాంతాల నాయకులు కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది

'పేదల పక్షం ఉండేదే కాంగ్రెస్'

- టీఆర్ఎస్ నాయకుల విమర్శలు అర్థరహితం



మాట్లాడుతున్న డీసీసీ అధికార ప్రతినిధి అంజనేయులుగౌడ్

నర్సాపూర్: టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని అడ్డుకుంటుందని విమర్శించడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధికార ప్రతినిధి అంజనేయులుగౌడ్, ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం, నర్సాపూర్ సర్పంచ్ వెంకటరమణారావు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యంగౌడ్, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, సురారంనర్సింలు విలేకరులతో మాట్లాడారు. సోమవారం మంత్రి హరీశ్‌రావు, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి నర్సాపూర్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల శంకుస్థాపనకు వచ్చి కాంగ్రెస్ పార్టీపై చేసిన విమర్శలను వారు తీవ్రంగా ఖండించారు. మంత్రిగా ఉన్న హరీశ్‌రావు నిధులన్నీ తన సొంత నియోజకవర్గమైన సిద్దిపేటకు తీసుకెళ్తూ ఇతర నియోజకవర్గాలను పట్టించుకోకున్నా ఆ పార్టీకి చెందిన ఇక్కడి ప్రజాప్రతినిధులు నోరు మెదపరన్నారు. సమావేశంలో వార్డు సభ్యులు అంజనేయులుగౌడ్, రషీద్, హుస్సేన్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాజేష్, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

'టీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పేదలతో రాజకీయం చేయొద్దు'

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టీఎం ఖాలేక్



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఖాలేక్

నర్సాపూర్: టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసం పేదల జీవితాలతో ఆడుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టీఎం.ఖాలేక్ విమర్శించారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత కాంగ్రెస్ పాలనలో ఎన్నికల ముందు 13వందలకు పైగా ఇళ్ల పట్టాలిచ్చి లబ్ధిపొందాలని ఆ పార్టీ నాయకులు చూశారని, ఇపుడు టీఆర్ఎస్ కూడా వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామంటూ వస్తున్నారన్నారు. ఆ రెండు పార్టీలకు పేదలకు న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి ఉంటే అర్హులైన నిరుపేదలకు రాజకీయాలకు అతీతంగా ఎంపిక చేసి వెంటనే నిర్మించడానికి ప్రయత్నించాలన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ మంత్రి కార్యక్రమం అడ్డుకుంటామని పేర్కొంటే సీపీఐ నాయకుడిగా ఉన్న తనను పోలీసులు తీసుకువచ్చి స్టేషన్‌లో ఉంచడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ పిలుపుతో తమ పార్టీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. పేదలకు న్యాయం జరగాలన్నదే తమ ధ్యేయమన్నారు. నాయకులు నందం, శేఖర్ పాల్గొన్నారు.

వర్షాల కోసం జలాభిషేకం

కొల్చారం: వర్షాలు సంవృద్ధిగా కురువాలని మంగళవారం కొల్చారం మండల పరిధిలోని రంగంపేటలో రైతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున శివాలయంలో జలాభిషేకం చేపట్టారు. ఖరీఫ్ సీజన్ నుంచి వర్షాలు కురియకపోవడంతో రైతులు, ఎంపీపీ అరిగె రజిని, జిల్లా ఆప్కో డైరెక్టర్ రమేశ్ తదితరులు పెద్ద ఎత్తున శివాలయంలో జలాభిషేకం నిర్వహించారు. ఎంపీపీ రజిని మాట్లాడుతూ భగవంతుడి ఆశీస్సులతో వర్షాలు కురిసి రైతుల పంటలు పండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగరాజు పంతులు, కృష్ణ పాల్గొన్నారు.

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్



మొక్కను నాటుతున్న చంద్రాగౌడ్

శివ్వంపేట: హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డి.చంద్రాగౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోమారం అంగన్‌వాడీ ఆవరణంలో టీఆర్ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ సుదీర్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డిలతో కలిసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం పచ్చగా ఉండి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో హరితహారం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, కమలమ్మ ఉన్నారు.

'రాజకీయ లబ్ధి కోసం సునీతారెడ్డి మాట్లాడటం తగదు'

శివ్వంపేట: పేద ప్రజలకు గత కాంగ్రెస్ హయాంలో మాజీ మంత్రి సునీతారెడ్డి రాజకీయ లబ్ధి కోసం బోగస్ పట్టాలు ఇచ్చారని టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి సునీతారెడ్డి గత కాంగ్రెస్ హయాంలో ఎన్నికల లబ్ధి కోసం 60గజాల స్థలంతో హద్దులు చూపించకుండా 1370 బోగస్ సర్టిఫికెట్లు ఇచ్చారని అన్నారు. ఇప్పుడు రాజకీయ లబ్ధికోసం ప్రజలకు న్యాయం చేసేంత వరకు పోరాటం ఆగదని అనడం విడ్డూరంగా ఉందన్నారు. లోకాయుక్త విచారణలో బోగస్ పట్టాలు అని తేలాయని, సునీతారెడ్డి చాలించాలని 60గజాల స్థలం బోగస్ పట్టాలు ఇచ్చారని అన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి ఉన్నారు.

అధికారిక కార్యక్రమాలకు సమాచారమివ్వరా ?

- ప్రొటోకాల్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

నర్సాపూర్: నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన మంత్రి హరీశ్‌రావు అధికారిక కార్యక్రమానికి తమకు కనీసం సమాచారం ఇవ్వకపోవడం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను అవమానపర్చినట్లేనని నర్సాపూర్ సర్పంచ్ వెంకటరమణారావు, ఎంపీటీసీ సురారం నర్సింలు పేర్కొన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణంలో 500 డబుల్‌బెడ్‌రూంల నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమానికి తమకు ఆహ్వానం లేకపోవడం అధికారుల పనితీరుకు నిదర్శనమన్నారు. అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులకు సరైన గౌరవం ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమం అంత పెద్ద ఎత్తున నిర్వహించిన అధికారులు ప్రొటోకాల్ ప్రకారం నర్సాపూర్ పట్టణ ప్రథమ పౌరుడిగా ఉన్న సర్పంచ్‌కు సమాచారం కూడా ఇవ్వకపోవడంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

బీవీఆర్ఐటీ విద్యార్థుల స్వచ్ఛ భారత్

నర్సాపూర్‌రూరల్: నర్సాపూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామంలో బీవీఆర్ఐటీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రోడ్లు, పాఠశాల ఆవరణంలోని పిచ్చిమొక్కలు, వాటర్ ట్యాంక్, చెరువు గట్టులను విద్యార్థులు శుభ్రం చేశారు. అలాగే నర్సాపూర్ పట్టణంలో పరిశుభ్రతపై విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి, బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను విద్యార్థులు శుభ్రం చేశారు. జేఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త పి.నమ్మాలాల్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఏవో బాపిరాజు, డీన్ శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం కాంతారావు పాల్గొన్నారు.

'పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలి'

శివ్వంపేట: పుట్టిన ప్రతి బిడ్డకు ముర్రుపాలు తాగించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోమారం అంగన్‌వాడీ కేంద్రం వద్ద తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు అరగంట లోపు తల్లిపాలు తాగిస్తే ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం గర్భిణుల కోసం కేసీఆర్ కిట్టు ప్రవేశపెట్టిందన్నారు. టీఆర్ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ సుదీర్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, కమలమ్మ ఉన్నారు.

10న మెదక్‌లో కవి సమ్మేళనం

నర్సాపూర్‌రూరల్: మెదక్ పట్టణంలోని టీఎన్‌జీవో భవనంలో ఈనెల 10న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండం మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలోని 31 జిల్లాలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. జీవన విధానం, సంస్కృతి, కళలు, బాల్యం, వృత్తులు, భాష, ప్రకృతి అనే అంశాలపై కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని, జిల్లాలోని కవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

11న అవగాహన సమావేశం

నర్సాపూర్‌రూరల్: ఈనెల 11న నర్సాపూర్ పట్టణంలో తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దళితుల అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు గణేష్, రమేశ్‌లు తెలిపారు.

సినిమాలు

తూప్రాన్

వేంకటేశ్వర — ఫిదా

వెల్దుర్తి

పావని — నక్షత్రం

రుక్మాపూర్ భూముల జాయింట్ సర్వే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేగుంట: మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామంలోని భూములపై అటవీ శాఖ నజర్ పడిందనే వార్త నేపథ్యంలో రెవెన్యూ, అటవీ శాఖల సంయుక్త సర్వే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. రుక్మాపూర్‌లోని 75 ఎకరాల భూములపై అటవీ శాఖాధికారులు పేద రైతులకు హుకుం జారీ చేయడాన్ని మంగళవారం ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురాగా రెవెన్యూ, అటవీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సర్వేకు శ్రీకారం చుట్టారు. చేగుంట మండల సర్వేయర్ రవీందర్‌రెడ్డి, తూప్రాన్ డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ అనురాధ, చేగుంట సెక్షన్ ఆఫీసర్ కరీమొద్దీన్ మంగళవారం రుక్మాపూర్‌లోని సర్వే నంబర్ 104లోని భూముల వివరాలను సేకరించారు. గత 30,35 సంవత్సరాలుగా ఇట్టి భూములపై అటవీ శాఖ అధికారులు ఏనాడు కలుగచేసుకోలేదని బాధిత రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. బోర్లు వేసుకొని, బ్యాంకు రుణాలు తీసుకొని జీవనం సాగిస్తున్న తమ భూములను ఎట్టి పరిస్థితుల్లో లాక్కోవద్దని అధికారులకు ప్రాధేయపడ్డారు. ఇరు శాఖల ఉమ్మడి సర్వే అనంతరం 104 సర్వే నంబర్‌లో భూమి ఏ శాఖకు చెందుతుందో సర్వే చేయనున్నట్లు వారు తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామాలింగారెడ్డి జిల్లా అటవీ అధికారులతో, జిల్లా రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఉమ్మడి సర్వేకు శ్రీకారం చుట్టగా, సర్వే అనంతరం వెలువడే ఫలితాల ప్రకారం ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.



రుక్మాపూర్ భూములను సర్వే చేస్తున్న అధికారులు

ఇబ్రహీంపూర్‌లో హరితహారం



ఇబ్రహీంపూర్‌లో మొక్కను నాటుతున్న సొసైటీ చైర్మన్ నారాయణరెడ్డి , సర్పంచ్ నాగభూషణం

చేగుంట: ఇబ్రహీంపూర్ గ్రామంలో మంగళవారం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ నాగభూషణం, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధులల్లో మొక్కలు నాటారు. ప్రతి ఇంటికి మొక్కలు అందజేస్తున్నామని నాటిన మొక్కలను కాపాడే విధంగా ట్రీగార్డులను ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఇప్పటికే గ్రామంలో అటవీ స్థలాన్ని కలుపుకొని 46 వేల మొక్కలు నాటామని, మరిన్ని మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడడంలో ఇబ్రహీంపూర్ ముందుంటుందని సర్పంచ్ నాగభూషణం వెల్లడించారు.

టీబీ వ్యాధిపై అవగాహన ర్యాలీ

వర్గల్: వరల్డ్ విజన్ ఇండియా హెల్త్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో టీబీ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు మొబైల్ ర్యాలీని మండల వైద్యాధికారి మాధవి, గౌరారం ఎస్ఐ శ్రీధర్ మంగళవారం వర్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రారంభించారు. వర్గల్, మర్కుక్, ములుగు మండలాల్లో టీబీ వ్యాధిపైఅవగాహన కల్పించేందుకు మొబైల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి మాట్లాడుతూ రెండు వారాలకు మించి ఎడతెరిపి లేని దగ్గు ఉంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జ్వరం, ఆకలి తగ్గడం, ఛాతిలో నొప్పి, దగ్గినప్పుడు రక్తం పడడం క్షయ వ్యాధి లక్షణాలన్నారు. జడ్పీటీసీ పోచయ్య, వైద్య సిబ్బంది భాస్కర్, వరల్డ్ విజన్ ఇండియా కోఆర్డినేటర్ నాగిరెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డేవిడ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న నాగరాజు

గజ్వేల్ అర్బన్: ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం నాగరాజు డిమాండ్ చేశారు. గజ్వేల్‌లోని విద్యుత్ పరికరాల మరమ్మతు కేంద్రంలో సమ్మె చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కార్మికులకు ఆయన సంఘీభావం ప్రకటించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెక్టార్‌లో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. చాలీ చాలని జీతాలతో, అర్ధాకలితో కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీఐటీయూ నాయకులు బండ్ల స్వామి, పోచయ్య, శ్రీనివాస్, రఘుపతి, ముస్తాఫా, బాల్‌రాజు, ఎల్లం, యాదగిరి తదితరులున్నారు.

తహసీల్దారు కార్యాలయాల ఎదుట ఎమ్మార్పీఎస్ ఆందోళన

తూప్రాన్: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్ట బద్ధత కల్పించాలంటూ ఎమ్మార్పీఎస్ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టింది. తూప్రాన్ పట్టణ ఎమ్మార్పీఎస్ కమిటీ అధ్యక్షుడు గజ్జెల రమేష్ (అర్జున్) మాదిగ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర కమిటీ నాయకులు గజ్జెల భిక్షపతి, గజ్జెల రాములులతో కలిసి తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఎమ్మార్పీఎస్ జెండాలు పట్టుకొని ఎస్సీ వర్గీకరణ చట్టానికి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలంటూ ఆందోళన చేపట్టారు. తహసీల్దారు కార్యాలయం ఎదుట బైటాయించి ఆందోళన ఉధృతం చేశారు. ఆనంతరం డిప్యూటీ తహసీల్దారు ఆర్చనకు వినతి పత్రం అందజేశారు. ఇందులో జిల్లా నాయకులు దుర్గయ్య, నాగులు, రమేష్, యాదగిరి, బాలసాయి, నర్సింలు, సత్యనారాయణ, స్వామి, బాబు, విక్రమ్, సుధాకర్, రమేష్, ఎల్లం, సుధాకర్, పెంటయ్య, మురళీ, నాగరాజులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మనోహరాబాద్‌లో...

మనోహరాబాద్(తూప్రాన్): ఎస్సీలలోని 59 కులాలకు సామాజిక న్యాయం చేసేందుకు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తు మంగళవారం ఎమ్మార్పీఎస్ తహసీల్ధారు కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. మనోహరాబాద్ తహసీల్దారు నజీబ్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ అధ్యక్షుడు ఎన్నెల్లి సుధాకర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బక్క శ్రీనివాస్, నాయకులు, ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులు, మహేందర్, అశోక్, దానయ్య, మహేందర్, శ్రీకాంత్, శ్రీధర్, బాబులు పాల్గొన్నారు.

పొలంగట్లపై ఏపుగా పెరిగిన టేకు చెట్లు

- **మొదటి విడత హరితహారంలో నాటిన టేకు మొక్కలు**
- **కతాన్‌పల్లిలోని 15 మంది రైతులకు లబ్ధి**

చేగుంట: ఉపాధిహామీ పథకంలో పొలంగట్లపై నాటిన టేకు మొక్కలు ఏపుగా పెరిగాయి. మండల పరిధిలోని కతాన్‌పల్లి గ్రామంలో పదిహేను మంది రైతుల పొలాల గట్లపై ఉపాధిహామీ పథకం కింద మొదటి విడత హరితహారంలో భాగంగా టేకు మొక్కలు నాటగా ఏపుగా పెరిగి గట్ల పటిష్టతతో పాటు రైతుల ఆదాయ వనరుగా మారింది. ఉపాధిహామీ ఏపీవో ఆదినారాయణ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కతాన్‌పల్లి గ్రామానికి చెందిన నర్సింలు, అంజయ్య, లచ్చయ్య, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితోపాటు మరికొంతమంది రైతుల వ్యవసాయ పొలాల గట్లపై టేకు మొక్కలు నాటారు. రెండున్నర సంవత్సరాల కాలంలో టేకుచెట్లు ఏపుగా పెరగడంతో పచ్చని కల సంతరించడమే కాకుండా రైతులకు ఆదాయ వనరుగా మారిందని పేర్కొన్నారు. మూడో విడత హరితహారంలో కూడా టేకు మొక్కలు సరఫరా చేస్తున్నామని, రైతులు తమతమ పొలాల గట్లపై నాటుకొని ఆదాయం పొందాలని సూచించారు.




పొలంగట్లపై నాటిన టేకు మొక్కలు



ఏపుగా పెరిగిన టేకు చెట్లు

మీజిల్స్, రూబెల్లా... ప్రాణాంతకం





- ఈ నెల 17 నుంచి టీకాలు
- 9 నెలల నుంచి 15 ఏళ్ల పిల్లలకు తప్పనిసరి

కొండపాక: పిల్లలు రోగాల బారిన పడకుండా ముందస్తుగా టీకాలు వేయించాలి. బిడ్డ పుట్టిన వెంటనే వ్యాధినిరోధక శక్తి మందులతోపాటు, ఇతర వ్యాధులు సోకకుండా వ్యాక్సిన్లు, ఇంజక్షన్లు వేయిస్తుంటారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పలు కార్యక్రమాలు అమలుచేస్తున్నది. పిల్లలకు ప్రాణాంతక వ్యాధులు రాకుండా ఉండడానికి వాక్సిన్‌ను అందివ్వబోతుంది.

వ్యాధుల కాలం


ఇది వర్షాకాలం అంటే వ్యాధుల కాలం. కొత్త నీరు రావడం, వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల వ్యాధులు సోకే ప్రమాదముంది. జలుబు, దగ్గు, ఆయాసం, తలనొప్పితో కూడిన జ్వరాలు సోకే ఈ సీజన్‌లో వాటి నుంచి రక్షణ పొందాలంటే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరగాలి. అందుకు యాంటి బయోటిక్ టీకాలు వేయించుకోవాలి. మీజిల్స్(తట్టు), రూబెల్లా వైరస్ వల్ల దేశంలో ఏటా దాదాపు 49 వేల మంది చిన్నారులు చనిపోతున్నట్లు ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి. పిల్లలను ఆరోగ్యవంతులుగా చేయాలని, అవి సోకకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంఆర్ టీకా అందిస్తున్నది.

మీజిల్స్, రూబెల్లాతో వచ్చే వ్యాధులు

మీజిల్స్, రూబెల్లా ప్రాణాంతకమైన వ్యాధులు చిన్నారుల్లో వైకల్యాలు, మరణాలకు కూడా దారితీస్తాయి. ప్రధానంగా దగ్గడం, తుమ్మడం వల్ల వచ్చే తుంపరలతో ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. తట్టు సోకిన వారికి దద్దుర్లు కనబడటానికి ముందు నాలుగు రోజుల నుంచి దద్దుర్లు తగ్గిన తర్వాత 4 రోజులు తర్వాత సంబంధిత వ్యక్తి నుంచి ఇతరులకు వ్యాపిస్తుంది. అతిసారం, నిమోనియా, నోటిపూత, చెవి ఇన్ఫెక్షన్, కళ్లు దెబ్బతినడం వంటి సమస్యలు రావచ్చు. ఇది కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా దారి తీయవచ్చు. గర్భిణీగా ఉన్నపుడు కలిగే రూబెల్లా ఇన్ఫెక్షన్‌తో గర్భం కోల్పోవడం లేదా మృతశిశువు జన్మించడం జరగవచ్చు. ఇమ్యూనైజేషన్ పొందని చిన్నారులకు మీజిల్స్, రూబెల్లా ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఎక్కువ.

ఎంఆర్ టీకాతో రక్షణ

ఈ వైరస్ సోకకుండా ఉండడానికి ఏకైక మార్గం వ్యాక్సినేషన్ చేయించుకోవడం. 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు చిన్నారులందరికీ టీకా వేయించుకోవాలి. ఈ నెల 17 నుంచి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఏరియా ఆస్పత్రిల్లో, పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో, పాఠశాలల్లో ఇస్తారు. గతంలో వ్యాక్సిన్ వేయించుకున్న చిన్నారులకు కూడా ఈ టీకాను మళ్లీ వేస్తారు. ఇది చిన్నారుల్లో వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. టీకాను వేయడానికి ప్రభుత్వం, వైద్యశాఖ సర్వం సిద్ధం చేసింది.







విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

ఎవరెవరు వేయించుకోవాలి ?

పోషకాహార లోపం ఉన్న చిన్నారుల్లో అతిసారం, నిమోనియా వంటి రోగాలు ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉంది. వీరికి అధిక ప్రాధాన్యాన్నిచ్చి ఈ టీకా వేయాలి. తేలిక పాటి శ్వాస సంబంధిత ఇబ్బందులు అతిసారం, తక్కువ జ్వరం వంటి చిన్న చిన్న అస్వస్థతలు కలిగిన చిన్నారులకు కూడా ఈ టీకాను వేయించవచ్చు.

ఎవరికి వేయించకూడదు

అధిక జ్వరం, ఇతర తీవ్రమైన వ్యాధులు ఉదాహరణకు అపస్మారక స్థితిలో ఉండడం, ఆస్పత్రిలో వివిధ రుగ్మతలతో చేరిన చిన్నారులు, గతంలో ఈ టీకాతో తీవ్రమైన అలర్జీ లేదా ప్రతిచర్యకు లోనైనవారికి ఇవ్వరాదు.

15 సంవత్సరాల లోపు వారికే ఎందుకు

పదిహేను సంవత్సరాల లోపు వయసు ఉన్న చిన్నారుల్లో ఈ వైరస్ సోకిన కేసులు అధికంగా ఉంటాయి. ఈ కారణంగా ప్రభుత్వం ఆ వయసు వారిలో వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి వారినే లక్ష్యంగా ఎంచుకుంది.

పాఠశాలల భాగస్వామ్యం

పదిహేను సంవత్సరాలలోపువారు ఎక్కువశాతం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంటారు. అందుకే పాఠశాలల భాగస్వామ్యం తీసుకుంటున్నారు. అందుకు ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కూడా ఇచ్చారు. పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నారు. తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి ఈ టీకా గురించి వివరిస్తూ వేయించాలని సూచిస్తున్నారు.

పిల్లల ఆరోగ్యమే మా బాధ్యత



పిల్లలు ఆరోగ్యంగా ఉంచేందుకు ఆరోగ్యశాఖ పని చేస్తున్నది. పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు మీజిల్, రూబెల్లా వాక్సిన్ ఎంతో దోహదపడుతుంది. 9 నెలల వయసు నుంచి 15 సంవత్సరాల పిల్లలందరికీ వ్యాక్సిన్ అందించేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉందన్నారు. ఈ వ్యాక్సిన్‌పై ఎలాటి అపోహలు పెట్టుకోవద్దు.

- మహమ్మద్ జాకీర్ హుస్సేన్, మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం



ప్రాణాంతక వ్యాధులైన మీజిల్ రూబెల్లా నివారణకు టీకా మందుపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. ప్రజల్లో చైతన్యం కల్పిసున్నాం. 15 సంవత్సరాల లోపు పిల్లలందరూ ఈ టీకా తప్పకుండా వేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. టీకా జీవితకాలం పనిచేస్తుంది.

- ఎ.శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఈవో , నంగునూరు

నైపుణ్యం సాధిస్తేనే భవిష్యత్తు

పటాన్‌చెరు రూరల్: నైపుణ్యంతో మంచి ఉద్యోగం పొందవచ్చని, నైపుణ్యమే బంగారు భవితకు బాట అని గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శివప్రసాద్ అన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, టెక్ ట్రంక్ వెంచర్స్ సౌజన్యంతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్‌పై నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యశాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రో వీసీ మాట్లాడుతూ పరిశ్రమలో మార్పులు వేగంగా చోటుచేసుకుంటున్నాయని, ఆ మార్పులను విద్యార్థులు అవగతం చేసుకుని వృత్తినిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కొత్త విషయాలను ఇష్టంతో కష్టపడి నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన శిక్షకుడిగా పాల్గొన్న టెక్ ట్రంక్ వెంచర్స్ సాంకేతిక నిపుణుడు అన్షు పాండే మాట్లాడుతూ కృత్రిమ మేథపై నైపుణ్యం సాధిస్తే ఉద్యోగ అవకాశాలుంటాయని అన్నారు. కృత్రిమ మేథస్సుతో రోబోలకు రూపకల్పన చేస్తున్న దశలో కార్యశాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించడం ముదావహమని, ఈ అవకాశాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సంజయ్ సూచించారు. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఈశ్వరయ్య అతిథులను స్వాగతించగా, కార్యశాల సమన్వయకర్త కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శివప్రసాద్

ఇప్పుడూ మామిడి తినొచ్చు



వర్షాకాలంలో మామిడి కాయలు విక్రయించడం ఏమిటని ఆశ్చర్యపోతున్నారా.? అవును... సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో మంగళవారం నిర్వహించిన సంతలో చాంద్‌ఖాన్‌పల్లికి చెందిన మణెమ్మ మామిడి కాయలను విక్రయించారు. మామిడి కాయలు ఎండాకాలంలోనే లభిస్తాయి. చివరగా జూన్ వరకు కూడా మార్కెట్లో అందుబాటులో ఉంటాయి. కానీ వర్షాకాలంలో మామిడి కాయలు విక్రయించడానికి రావడంతో జనాలు వాటిని ఆసక్తితో కొనుగోలు చేశారు. సాధారణంగా సీజన్‌లో మామిడి కాయలను రూ.5కు ఒకటి చొప్పున విక్రయించినప్పటికీ ప్రస్తుతం రూ.10కి ఒకటి చొప్పున విక్రయించారు. ఈ విషయమై మామిడి కాయలను విక్రయిస్తున్న మణెమ్మను 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా జహీరాబాద్ సమీపంలోని కోహీర్‌లో మామిడి కాయలు లభించడంతో అక్కడి నుంచి కొనుగోలు చేసి విక్రయించడానికి తీసుకువచ్చానని తెలిపారు.

- నారాయణఖేడ్



చీకట్లోనే మార్కెట్

దళారులుండరు... అమ్మకాల్లో రైతులే రాజులు

● తూప్రాన్ పట్టణంలో అర్ధరాత్రి నిర్వహణ ● సస్తా ధరల్లో కూరగాయలు

మార్కెట్, సంత, అంగడి పేరేదైనా సరుకులన్నీ ఒకేచోటా సస్తాగా లభించే చోటు. కూలీలు, పేదలు వారంలో ఓ రోజు జరిగే అంగట్లోనే సరకులు కొంటుంటారు. ఈ మార్కెట్లన్నీ ఉదయం నుంచి సాయంత్రం చీకటి వరకే నిర్వహిస్తారు. రాత్రయ్యిందంటే కొనుగోళ్లుండవు. కానీ తూప్రాన్ పట్టణంలో మార్కెట్ రాత్రుల్లోనే సాగుతుంది. అమ్మకందారులు, కొనుగోలుదారులు రాత్రుల్లోనే మార్కెట్‌కొచ్చి కొనుగోళ్లు, అమ్మకాలు చేస్తుంటారు. మార్కెట్ ధరలను బట్టి రైతులు ధర ప్రకటిస్తే, బేరమాడి కొనుగోలు చేస్తుంటారు. కొనుగోలు, అమ్మకాల్లో దళారులు లేకుండానే మార్కెట్ కొనుగోళ్లు సాగుతున్నాయి. కొనుగోళ్లకు హైదరాబాద్, కామారెడ్డి నుంచి వ్యాపారులు వస్తుంటారు. ఈ వింతైన రాత్రి మార్కెట్ మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో నిత్యం జరుగుతుంది.

> చీకట్లో మార్కెట్ అనగానే ఏదో గుట్టుగా సాగే తప్పుడు దందా కాదండోయ్.. తూప్రాన్ పట్టణంలో అర్ధరాత్రి రైతులే నిర్వహించే కూరగాయల మార్కెట్ ఇక్కడ అన్నీ సస్తా అనేది ఇక్కడికొచ్చే కొనుగోలు దారుల అభిప్రాయం.
>
> \- తూప్రాన్





తూప్రాన్ మండలంలో రైతులు భారీగా కూరగాయల సాగు చేపడుతుంటారు. రైతులు పండించిన కూరగాయలను ఎర్రగడ్డ మార్కెట్‌కు ఎక్కువగా తీసుకెళ్తుంటారు. ఎర్రగడ్డ మార్కెట్‌లో ఈ ప్రాంత రైతులు చాలా మంది గుర్తింపుకార్డులతో అమ్మకాలు సైతం చేస్తుంటారు. ఎర్రగడ్డకు తీసుకెళ్లలేని రైతుల ఇక్కడిక్కడే అమ్మకాలు చేస్తుంటారు. ఇక్కడిక్కడే అమ్మకాలు చేసేందుకు పట్టణంలోనే రాత్రుళ్లలో జరిగే ఓ మార్కెట్ ఉంది. ఈ మార్కెట్ అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉ. 5 గంటల వరకు సాగుతుంది. హైదరాబాద్ పాతసిటీలో నిర్వహించే జుమ్మేరాత్ బజారు లాగే ఉంటుంది. ఆ మార్కెట్ గురువారం తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే వారంలో ఒకేరోజు సాగుతుంది. కానీ, తూప్రాన్ మార్కెట్ నిత్యం అర్ధరాత్రుల్లో స్ట్రీట్‌లైట్ల వెలుతురులో సాగిస్తుంటారు. పట్టణంలో హైవేకు ఒక వైపు కూరగాయాల మార్కెట్ నిర్వహిస్తుంటారు. రైతులు అర్ధరాత్రి నుంచే రైతులు తాము పండించిన కూరగాయాలను ఆటోరిక్షాలు, మోటారు సైకిళ్లు, సైకిళ్లపై తూప్రాన్‌కు తీసుకొస్తారు. వ్యాపారులు సైతం అర్ధరాత్రే వచ్చ ఇక్కడ కొనుగోళ్లు చేస్తుంటారు. చుట్టు పక్క ఎవరింట్లో పెళ్లిళ్లయినా ఇక్కడినుంచే కూరగాయలు తీసుకెళ్తుంటారు. అంతేకాదు అనేక శుభకార్యాలకు హోటళ్లకు, చిరువ్యాపారులు ఇక్కడే కొనుగోలు చేస్తుంటారు. పట్టణంలో కూరగాయాల వ్యాపారం చేసుకునే వారందరూ రాత్రుల్లో విచ్చేసి కొనుగోలు చేసి ఉదయం అమ్మకాలు చేసుకుంటుంటారు. మార్కెట్ డిమాండ్‌ను బట్టి కూరగాయల రేట్లుంటాయి. రైతు తాను పండించిన కూరగాయలను తనకిష్టమొచ్చిన మార్కెట్ ధరకు అమ్ముకునే మార్కెట్ ఇదొక్కటే. ఏవైనా కూరగాయాలు తక్కువగా మార్కెట్‌కు వస్తే డిమాండ్ అధికంగా ఉంటుంది. దళారుల్లేకుండా రైతులే అమ్మకాలు చేపట్టి, నగదు తీసుకెళ్తుంటారు. మార్కెట్ డిమాండున్న కూరగాయాలను రైతు తెస్తే ఎగబడి కొనుగోలు చేయడంతోపాటు, రైతును ఉక్కిబిక్కిరి చేస్తుంటారు. రైతు కొంచెం జాగ్రత్త వహిస్తే రాత్రి మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముకోవచ్చు. ఈ రాత్రి మార్కెట్‌లో మేడ్చల్, మనోహరాబాద్, శివ్వంపేట, చేగుంట, చిన్నశంకరంపేట, నార్సింగి, రామాయంపేట, కామారెడ్డి ప్రాంతాల నుంచి విచ్చేసి కొనుగోలు చేస్తుంటారు. రాత్రి మార్కెట్ చూడాలంటే తూప్రాన్ పట్టణానికి విచ్చేసి ఓ లుక్కేయాల్సిందే.



శ్రీహరి కల్యాణం చూతము రారండి

● నేడు మెదక్‌లో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం
● ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఏర్పాట్లు
● పార్టీలకతీతంగా శ్రీనివాస కల్యాణంలో పాల్గొనాలి: నిర్వాహకులు

మెదక్ అర్బన్: వేంకటేశ్వర కల్యాణ మహోత్సవం బుధవారం మెదక్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో వైభవంగా నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీనివాస కల్యాణ మహోత్సవం సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానుంది. ఇప్పటికే వెంకన్న కల్యాణ మహోత్సవానికి తితిదే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మెదక్‌జిల్లాలో తొలిసారి నిర్వహిస్తున్న వేంకటేశ్వర కల్యాణానికి పెద్దఎత్తున భక్తులు హాజరవనున్నారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. కన్నుల పండువగా నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు మెదక్ జిల్లాలోని శ్రీవారి భక్తులు పాల్గొని కల్యాణమహోత్సవాన్ని తిలకించాలని నిర్వాహకులు కోరారు. శ్రీవారి కల్యాణమహోత్సవానికి ఉచిత ప్రవేశం, తీర్థప్రసాదాలు కూడా ఉచితంగా అందజేయనున్నట్లు వారు తెలిపారు. తిరుమల నుంచి వేదపండిత బృందాలు, అర్చక స్వాములు మెదక్‌కు చేరుకున్నారు. వేద మంత్రోచ్చారణలతో పాటు శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైన అన్నమయ్య సంకీర్తనలను నిర్వహించారు. తిరుమల ఆనంద నిలయంలో శ్రీవారి కల్యాణం ఏవైనంలో జరుగుతుందో అదే విధంగా మెదక్‌లోనూ జరగనుంది.



విలేకరులతో మాట్లాడుతున్న నిర్వాహకులు

పార్టీలకతీతంగా హాజరు కావాలి

రెండేళ్ల క్రితం మెదక్‌లో శ్రీనివాస కల్యాణం నిర్వహించాలని టీటీడీకి దరఖాస్తు చేశామని, అంతేకాకుండా ఈ విషయాన్ని ఏపీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని నిర్వాహకులు తెలిపారు. చంద్రబాబు ఆదేశంతో ఈ కల్యాణమహోత్సవ కార్యక్రమాన్ని మెదక్ జిల్లాలో నిర్వహించాలని నిర్ణయించారు. బుధవారం నిర్వహించనున్న కల్యాణమహోత్సవానికి పార్టీలకతీతంగా అందరూ హాజరు కావాలని వారు తెలిపారు. స్వామివారి కల్యాణంలో పాల్గొని ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు ప్రముఖ సిద్ధాంతి శాస్త్రుల కృష్ణమూర్తి, బట్టి జగపతి, కొండని సురేందర్‌గౌడ్, గంజి శ్రీనివాస్, వినోద్, వెంకటేశం, మచ్చేందర్‌నాథ్ కోరారు.



కలియుగ ప్రత్యక్ష దైవం

